తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
అనునిత్యం ప్రజల పక్షం
TELTEL12273
ఎడిటర్: బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



విలేకరులు కావలెను

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలవడుతున్న
తెలంగాణ ముచ్చట్లు దిన పత్రికలో
పనిచేయుటకు జిల్లా బ్యూరో, స్టాఫ్ రిపోర్టర్లు,
నియోజకవర్గ ఆర్.సి.లు, మండల స్థాయి రిపోర్టర్లుగా
పనిచేయుటకు ఆసక్తి, ఉత్సాహం కలిగిన
యువతి యువకులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.

9493669669, 9391230209



వరంగల్ సంపుటి : 2 సంచిక : 148 శనివారం 29 - 06 - 2024 పేజిలు : 08 వెల : 5


# ఢిల్లీలోనే సిఎం రేవంత్

## వరంగల్ పర్యటన వాయిదా



హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు : జూన్28 : సిఎం రేవంత్‌రెడి వరంగల్ పర్యటన వాయిదా పడింది. తొలుత శుక్రవారమే ఆయన పర్యట న ఖరారైన ప్పటికీ దానిని వాయిదా వేసుకున్నారు. ఢిల్లీలో అధిష్ఠానం పెద్దలతో పిసిసి చీఫ్ ఎంపికపై చర్చలు కొనసాగుతున్న నేపథ్యంలో శుక్రవారం కూడా ఆయన అక్కడే ఉండాల్సి వచ్చింది. మరో వైపు వరంగల్ పర్యటనలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టు, అండర్ గ్రౌండ్ సిస్టం, ఔటర్ రింగ్ రోడ్డు, మామునూరు ఎయిర్‌పోర్టు తదితర అభివృద్ధి పనులపై ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించాలని భావించారు. ఢిల్లీలో బిజీగా ఉండడంతో ఆయన రాష్ట్రానికి రాలేక పోయారు. బహుశా శుక్రవారం సాయంత్రానికి చేరుకోవచ్చని అంటున్నారు.

# ఘనంగా పివి జయంతి వేడుకలు

- ఉభయ తెలుగు రాష్ట్రాల్లో నివాళి
- పివి ఘాట్ వద్ద నివాళి అర్పించిన ప్రముఖులు
- తెలంగాణ భవన్‌లో నివాళి అర్పించిన బిఆర్ఎస్ నేతలు
- ఢిల్లీలో నివాళి అర్పించిన మంత్రులు







హైదరాబాద్,జూన్28తెలంగాణ ముచ్చట్లు : దివంగత పివి నరసింహారావు జయంతి వేడుకలు తెలుగు రాష్ట్రాలతో పాటు, ఢిల్లీలోనూ ఘనంగా జరిగాయి. భారతరత్న, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు జయంతి. ఆయన జయంతిని తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ఘనంగా జరుపుకున్నారు. హైదరాబాద్ పివి ఘాట్ వద్ద భారత రత్న, దివంగత మాజీ ప్రధాని పివి నరసింహారావు 103వ జయంతి వేడుకలు జరిగాయి. పివి ఘాట్ వద్ద పివి కుమార్తె వాణిదేవి, కుమారుడు ప్రభాకర్ రావు, మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి, తీగల కృష్ణారెడ్డి, కోదండరామ్, హైకోర్టు జడ్జి శ్రావణ్ కుమార్, తదితరలు నివాళులర్పించారు. అసెంబ్లీలో పివి నరసింహరావు చిత్రపటానికి సభాపతి గడ్డం ప్రసాద్, మండలి చైర్మన్ సుఖేందర్ రెడ్డిలు పూలమాల వేసి నివాళులర్పించారు. ఢిల్లీలో తెలంగాణ భవన్‌లో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబులు పివికి నివాళి అర్పించారు. ఆయన చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. పివి ఆర్థిక దార్శనికుడని కీర్తించారు. తెలంగాణ భవన్‌లో పివి నరసింహరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, ఎంఎల్సీ వాణీదేవి, ఎంఎల్ఎ జగదీశ్ రెడ్డి, మహమూద్ అలీలు పూలమాల వేసి నివాళులర్పించారు. భారత రత్న దివంగత మాజీ ప్రధాని పి.వి 103 జయంతి సందర్భంగా గాంధీ భవన్ లో పి వి చిత్ర పటానికి కాంగ్రెస్ నాయకులు మాజీ ఎంపి వి. హనుమంతరావు, డిసిసి అధ్యక్షులు నర్సింహారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంగిశెట్టి జగదీష్, అల్లం భాస్కర్, భవాని రెడ్డి, రాపోలు జయ ప్రకాష్, ప్రేమలత అగర్వాల్, లింగం యాదవ్ తదితరులు నివాళులర్పించారు.తెలంగాణ భవన్ లో మాజీ ప్రధాని, భారత రత్న పీవీ నరసింహ రావు జయంతి సందర్భంగా పీవీ చిత్రపటం వద్ద బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

2లో

# బహుముఖ ప్రజ్ఞాశాలి పివి

## నివాళి అర్పించిన మాజీ సిఎం కెసిఆర్

హైదరాబాద్,తెలంగాణ ముచ్చట్లు : బహుముఖ ప్రజ్ఞాశాలి, బహుభాషాకోవిదుడు, దేశ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, తెలంగాణ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిన మహా మేధావి, భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతి సందర్భంగా దేశానికి ఆయన అందించిన సేవలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. నాటి ప్రపంచ ఆర్థిక విధానాలకు అనుగుణంగా సంస్కరణలు చేపట్టి దేశ ఆర్థిక స్థితిని చక్కదిద్దిన దార్శనికుడు, భారతజాతి ముద్దుబిడ్డ పీవీ అని చెప్పారు. తెలంగాణ బిడ్డగా మనందరం

2లో

## కెసిఆర్ పిటిషన్‌పై

# హైకోర్టులో విచారణ

## తీర్పును రిజర్వ్ చేసిన ధర్మాసనం



హైదరాబాద్,జూన్28తెలంగాణ ముచ్చట్లు : హైకోర్టులో తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు ముగిశాయి. విద్యుత్ కమిషన్ ఏర్పాటు జీవోను కొట్టివేయాలని కేసీఆర్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి జారీ చేసిన నోటీసులు రద్దు చేయాలని కేసీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. కేసీఆర్ పిటిషన్‌కు విచారణ అర్హత ఉందా లేదా అనే దానిపై వాదనలు ముగిశాయి. అనంతరం కేసీఆర్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్ చేసినట్లు హైకోర్టు ప్రకటించింది. అయితే కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణ స్వీకరించవద్దని అడ్వకేట్ జనరల్ కోరారు. పిటిషన్‌ను విచారణకు అనుమతించడం పైనే వాదనలు వినిపించాలని? మెరిట్స్‌లోకి వెళ్లవద్దని

2లో

## టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

# పరీక్షా ఫలితాలు విడుదల

హైదరాబాద్,జూన్ 28తెలంగాణ ముచ్చట్లు : తెలంగాణ పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విడుదలయ్యాయి. సప్లిమెంటరీ ఫలితాల్లో 73.03 శాతం ఉత్తీర్ణత నమోదైంది. జూన్ 3 నుంచి 13వ తేదీ వరకు నిర్వహించిన పరీక్షలకు 51,272 మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా, 46,731 మంది హాజరయ్యారు. వీరిలో 34,126 మంది ఉత్తీర్ణత సాధించారు. బాలురు 71.01 శాతం ఉత్తీర్ణత నమోదు చేయగా, బాలికలు 76.37 శాతం ఉత్తీర్ణత సాధించి తమ సత్తా చాటారు. బాలుర కంటే బాలికలు 5.36 శాతం అధికంగా ఉత్తీర్ణత నమోదు చేశారు. నిర్మల్ జిల్లా 100 శాతం ఉత్తీర్ణత సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. వికారాబాద్ జిల్లా 42.14 శాతం ఉత్తీర్ణత నమోదు చేసి చివరి స్థానంలో నిలిచింది. ఫలితాల కోసం ఈ వెబ్‌సైట్‌ను క్లిక్ చేయొచ్చు. రీకౌంటింగ్ చేయించాలనుకునే విద్యార్థులు ఒక్కో స్జబెక్ట్‌కు

2లో

## ఎమ్మెల్యే కవితతో

# హరీష్ రావు భేటీ

## ధైర్యంగా ఉండాలని హితవు



న్యూఢిల్లీ,జూన్28 : తీహార్ జైలులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితతో ఆ పార్టీ నాయకులు, మాజీ మంత్రి హరీష్ రావు శుక్రవారం ఉదయం ములాఖాత్ అయ్యారు. ములాఖాత్ సందర్భంగా ఎమ్మెల్సీ కవిత యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండమని కవితకు సూచించారు. ఇటీవలే మాజీ మంత్రులు సత్యవతి రాథోడ్, సబితా ఇంద్రారెడ్డి, కేటీఆర్ కవితతో ములాఖత్ అయిన విషయం విదితమే. ఢిల్లీ మద్యం విధానం కేసులో రిమాండ్‌లో ఉన్న ఎమ్మెల్సీ కవిత జ్యుడీషియల్ కస్టడీని మరోసారి పొడిగించిన సంగతి తెలిసిందే. జూలై 5 వరకు ఆమె కస్టడీని పొడిగిస్తూ రౌస్ ఎవెన్యూ కోర్టు ఉత్తర్వులు జారీచేసింది. అధికారులు జూన్ 21వ తేదీన ఆమెను వర్చువల్‌గా కోర్టు ముందు హాజరుపరిచారు.ఈ కేసును జూలై 3వ తేదీన రౌస్ ఎవెన్యూ కోర్టు మరోమారు విచారణ జరుపనున్నది. కాగా,కవిత బెయిల్ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు తీర్పును రిజర్వ్ చేసింది.

# లారీని ఢీకొట్టిన మరో లారీ

## నలుగురు వ్యక్తుల దుర్మరణం

మెదక్,జూన్28తెలంగాణ ముచ్చట్లు : మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాం జరిగింది. లారీని మరో లారీ వెనకనుంచి ఢీకొనడంతో నలుగురు దుర్మరణం చెందారు. తెల్లవారుజామున కావడంతో లారీ డ్రైవర్ నిద్ర మత్తులో ఉన్నారో ఏమో కానీ పెను ప్రమాదం జరిగింది. ఒక లారీని వెనుక వస్తున్న లారీ ఢొకట్టింది. ఈ ప్రమాదంలో నలుగురుదుర్మరణం పాలయ్యారు. ఈ దుర్ఘటన మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం వద్ద బైపాస్ రోడ్డులో జరిగింది. ఒక లారీని వెనుక నుంచి వచ్చిన మరో లారీ ఢీ కొట్టడంతో వెనుక లారీలోని క్యాబిన్‌లో కూర్చొన్న నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనకు సంబంధించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలిస్తున్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక

శనివారం 29 -06- 2024



# సంపాదకీయం

## పివి ఆర్థిక విధానాలను పట్టించుకోని మోడీ

ఇందిర ఎమర్జెన్సీని పదేపదే ప్రస్తావించి..కాంగ్రెస్‌ను ఇరుకున పెట్టే ప్రయత్నాలు చేస్తున్న ప్రధాని మోడీ.. ఆర్థిక సంస్కరణలపైనా ఇదే విధానం అవలంబిస్తే బాగుండేది. దార్శనికుడు దివంగత ప్రధాని పివి నరసింహారావు అనుసరించిన ఆర్థిక విధానాలను అవలోకనం చేస్తే మంచిది. ప్రపంచానికి ఆదర్శంగా మన ఆర్థిక విధానాలు అవలంబించి...కొడిగట్టిన భారత ఆర్థిక వ్యవస్థను దేదీప్యమానంగా వెలిగించిన మహాను భావుడు పాములపర్తి వెంకట నరసింహారావు అనడంలో సందేహం లేదు. గత పదేళ్లుగా దేశ అర్థికరంగం కుదేలయ్యింది. జివిఎస్టీ గురించి పదేపదే గొప్పుల చెబుతున్న మోడీ రాష్ట్రపతి ప్రసంగంలోనూ దీనిని మరోమారు ప్రస్తావించారు. కానీ క్షేత్రస్థాయిలో జివిఎస్టీ వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదు. డాలర్ మారకం రేటు పెరుగుతోంది. వడ్డీరేట్లు పెరుగుతున్నాయి.నిత్యావసర ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి. ఇలా ఎందుకు జరుగుతుందో పరిశీలన చేసే ఓపికా,చిత్తశుద్ధి ప్రధాని మోడీకి లేదు. ఆయనకు ఎవరు సలహాలు ఇస్తున్నారో కానీ దేశ ఆర్థిక వ్యవస్థ మాత్రం బతికి బట్టకట్టేలా లేదు. సామాన్యులు దర్జాగా బతకగలిగిన నాడే జిడిపి లెక్కలు బాగున్నట్లు గుర్తించాలి. సామాన్యులు ఇల్లు కట్టుకున్ననాడే మన ఆర్థిక వ్యవస్థ బాగున్నట్లుగా గుర్తించాలి. ఇవన్నీ మోడీకి తెలియవా అంటే తెలుసు. కానీ తెలుసుకుని బాగుచేద్దామన్న సంకల్పమే కానరావడం లేదు. మోడీ ఆర్థిక విధానాలపై వారి లెక్కలు వారికి ఉన్నాయి. వారంతా మేం బ్రహ్మాండగా పాలిస్తున్నామని అనుకుంటున్నారు. పదేళ్ల తరవాత కూడా చావుదప్పి కన్నులొట్టబోయినట్లుగా, బొటాబొటి మెజార్టీతో అధికారంలోకి వచ్చినా... ప్రజలంతా మోడీకి జై కొట్టారని భావిస్తున్నారు. కానీ మోడీ తీసుకుంటున్న నిర్ణయాలు సామాన్యులకు చేటుగా మారాయి. ఉదాహరణకు జివిఎస్టీకి సంబంధించి తీవ్ర ప్రభావం చూపుతున్న నిర్ణయాలపై చర్చించడం లేదు. అప్పు చేసి, పొదుపు చేసుకుని హెల్త్ ఇన్సూరెన్స్, లైఫ్ ఇన్సూరెన్స్ కడుతున్నవారు జివిఎస్టీ రూపంలో భారీగగా పన్నులు కట్టి నష్టపోతున్నారు. పాలసీలపై బాదుడు దారుణంగా ఉంది. పేద, మధ్య తరగతి ప్రజలు చెమటోడ్చి కడుతున్న పాలసీలపై 18 శాతం జివిఎస్టీ కట్టించుకుంటున్నారు. ఇంతమొత్తంలో కట్టడం వల్ల సామాన్యులు కుదేలవుతున్నారు. దీనిపై ఎవరు కూడా చర్చించడం లేదు. ఇలాంటి బాదుళ్లు ఎన్నో ఉన్నాయి. వీటిని ఎక్కడా చర్చించడం లేదు. రాజనీతిజ్ఞత,ఆర్థిక సంస్కరణాలాభిలాష అన్నవి ప్రతిభ ఉండి అమలు చేయగల ధైర్యం ఉన్న నేతకు మాత్రమే సొంతం. ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన నాటికి దేశాన్ని కుదిపి వేస్తున్న ఆర్థిక సంక్షోభాన్ని చాకచక్యం గా పరిష్కరించి, దేశానికి బంగారు బాట వేసిన ధీశాలి పివి నరసింహారావు. దేశానికి అవసరమైన ఆర్థిక,రాజకీయ సంస్కరణలతో ముందుకు సాగిన రాజనీతిజ్ఞుడు పీవీ. కానీ ఆయన సంస్కరణలను మరింత ముందుకు తీసుకుని వెళ్లేలా తరవాతి ప్రభుత్వాలు విఫలం అయ్యాయి. పదేళ్లపాటు యూపిఎ ప్రభుత్వంలో ప్రధానిగా ఉన్న నాటి ఆర్థికమంత్రి మన్మోహన్ సింగ్ కూడా మళ్లీ వీటిని సమర్థంగా ముందుకు తీసుకుని వెళ్లలేకపోయారు. నేటి ప్రధాని మోడీ హయాంలో కూడా ఆర్థిక విధానాలు సక్రమంగా అమలు కావడం లేదు. తాను తీసుకుని వచ్చిన జివిఎస్టీ గురించి గొప్పలు చెప్పడమే తప్ప అవి ప్రజలపై ఏ మేరకు విష ప్రభావం చూపుతున్నాయో గమనించడం లేదు. బిజెపిలో ఉన్న నేతలు కూడా దీనిగురించి చర్చించడం లేదు. ఇప్పుడు ఎన్‌డిఎ పక్షాలు అయినా ఈ జివిఎస్టీ బాదుడు గురించి చర్చించాలి. లేకుంటే వారిని కూడా ప్రజలు క్షమించారు. ఆర్థిక సంస్కరణ అన్నది ప్రజలను కష్టాలు, నష్టాల నుంచి గట్టెక్కించేలా ఉండాలి. కానీ జివిఎస్టీతో కష్టాలు, నష్టాలే తప్ప ప్రజలకు ఒనగూరు తున్న ప్రయోజనం లేదు. బ్యాంకులు దివాళా తీయడం మొదలు, బ్యాంకులకు లక్షల కోట్లు ఎగవేసిన కొందరు విదేశాలకు ఉడాయించారు. ఇలాంటి మోసాలను నిరోధించేలా మోడీ చర్యలు తీసుకోలేక పోయారు. మరో పదేళ్లు మోడీ అధికారంలో ఉన్నా ఇవి సాధ్యపడవని గుర్తించాలి. బ్యాంకులకు రుణాలను ఎగవేసి, దేశాన్ని ముంచేసి పారిపోయిన వారిని వెనక్కి రప్పించి కఠిన చర్యలు తీసుకోవడంలో మోడీ విఫలం అయ్యారు. ఎందరో ఎంపిలు, మంత్రుల్లో ఆర్థిక ఎగవేతదారులుగా ఉన్నా వారిపై చర్యలు తీసుకోవడం లేదు. అందుకే ఆనాటి పరిస్థితులను నేటితో పోల్చుకోవాల్సి వస్తుంది. పివి తీసుకున్న నిర్ణయాల వల్ల సామాన్యులకు ఎంతో మేలు జరిగింది. ఆధునిక భారతంలో ఆర్థిక సంస్కరణలను మనదేశం అవలబిం చడం వల్లనే ఇవాళ మనమంతా ఈ స్థితిలో ఉన్నాం అని చెప్పుకోవడానికి దివంగత ప్రధాని పివి నరసింహా రావును నిత్యం స్మరించుకోవాల్సింది. ఆర్థిక సంస్కరణలను ప్రతిపాదించినప్పుడు యధావిధిగానే కమ్యూనిస్టులు వ్యతిరేకించారు. అయితే ఆయన ధైర్యంగా వీటిని ముందుకు తీసుకుని వెళ్లి అమలు చేసిన ధీశాలి. పివి సంస్కరణలతో ప్రపంచంతో వాణిజ్యం పెరగడమే గాకుండా,మన యువత విదేశాలకు చదువులకు, ఉద్యోగాలకు వెళ్లగలిగే అవకాశాలను అందిపుచ్చుకున్నారు. దేశం తీవ్ర ఆర్థికసంక్షోభంలో ఉన్నప్పుడు ,ఊహించని రీతిలో ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి మార్కెట్ సరళీకరణ విధానాన్ని రూపొందించి భారత్‌కు మార్గాన్ని చూపారు. ఇప్పుడూ మార్గంలోనే మన ఆర్థిక వ్యవస్థ నడుస్తోంది.

# నేడు కొండగట్టుకు డిప్యూటీ సీఎం పవన్

## పవన్ కళ్యాణ్ రాకతో భారీగా ఏర్పాట్లు



హైదరాబాద్,జూన్28**తెలంగాణ ముచ్చట్లు :** జనసేన చీఫ్, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శనివారం జగిత్యాల జిల్లాలోని కొండగట్టు పుణ్యక్షేత్రాన్ని దర్శించుకోనున్నారు. దీంతో పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో పోలీసులు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈమేరకు ఏపీ పోలీసులు పవన్ పర్యటన షెడ్యూల్‌ను విడుదల చేశారు. వారాహి అమ్మవారి దీక్షలో పవన్ కల్యాణ్.. శనివారం ఉదయం 7 గంటలకు మాదాపూర్‌లోని తన నివాసం నుంచి రోడ్డు మార్గంలో కొండగట్టుకు బయల్దేరనున్నారు. ఉదయం 11 గంటలకు కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయానికి ఆయన చేరుకోనున్నారు. గంటన్నర పాటు కొండగట్టు పుణ్యక్షేత్రంలో పవన్ గడపనున్నారు. ఆంజనేయ స్వామికి పవన్ ప్రత్యేక పూజలు చేయనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు కొండగట్టు నుంచి మాదాపూర్‌కు రోడ్డు మార్గంలో తిరిగి రానున్నారు.సాయంత్రం 4.30కు మాదాపూర్ చేరుకోనున్నారు. శనివారం రాత్రికి హైదరాబాద్‌లోనే డిప్యూటీ సీఎం పవన్ బస చేయనున్నారు. పవన్ కల్యాణ్ చేపట్టిన వారాహి దీక్ష వివాదాస్పదంగా మారిన సంగతి తెలిసిందే. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో బంపర్ మెజారిటీతో గెలవడంతో పవన్ కల్యాణ్ జూన్ 26న వారాహి అమ్మవారి దీక్షను తీసుకున్నారు.

11 రోజుల పాటు నిష్టగా ఈ దీక్షను పవన్ కల్యాణ్ పాటించనున్నారు. పసుపు రంగు దుస్తుల్లో ఆధ్యాత్మిక భావం ఉట్టిపడేలా ఉన్న పవన్ కల్యాణ్ ఫొటోలు చూసి ఫ్యాన్స్ పండుగ చేసుకుంటున్నారు. అయితే ఈ దీక్ష దుస్తుల్లో ఉన్న పవన్ కల్యాణ్ చెప్పులు వేసుకుని కనిపించడం చర్చనీయాంశంగా మారింది.

# జగిత్యాలలో ఫ్లెక్సీ వార్

## ఎమ్మెల్యే సంజయ్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిల పోటాపోటీ ఫ్లెక్సీలు

జగిత్యాల,జూన్28**తెలంగాణ ముచ్చట్లు:** జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరడంతో పెద్ద దుమారం చెలరేగింది. సీనియర్ నేత తాటిపర్తి జీవన్ రెడ్డి నుంచి పెద్ద ఎత్తున వ్యతిరేకత వచ్చింది. జీవన్ రెడ్డిని కూల్ చేసేందుకు మంత్రి శ్రీధర్ బాబు, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క రంగంలోకి దిగారు. విడతలవారీగా చర్చలు జరిపారు. హైకమాండ్ పెద్దలు చర్చలు జరిపారు. తగిన ప్రాధాన్యం ఇస్తామని.. మంత్రి పదవి అంటూ చెప్పుకొచ్చారు. హైకమాండ్ పెద్దలతోపాటు సీఎం రేవంత్ రెడ్డిని జీవన్ రెడ్డి కలువడం ప్రాధాన్యం సంతరించుకుంది. అంతా సర్దుకుంటుందని అనుకునే లోపు స్థానిక నేతల మధ్య వివాదం నెలకొంది. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ తనకు చెప్పి పార్టీలోకి వస్తే బాగుంటుందని జీవన్ రెడ్డి వర్గం అంటోంది. హైకమాండ్ పెద్దలు జీవన్ రెడ్డిని కూల్ చేశారు. అంతా సర్దుకుంటుందని అనుకునే లోపు మరో వివాదం తెరపైకి వచ్చింది. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే సంజయ్ కుమార్ అనుచరులు బస్టాండ్ వద్ద ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. జగిత్యాల డెవలప్ కోసం సంజయ్ కాంగ్రెస్ పార్టీలో చేరారని ఆ ఫ్లెక్సీ మీద రాశారు. ఎమ్మెల్యే సంజయ్‌కు అతని అనుచరులు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆ ఫ్లెక్సీ ఏర్పాటు చేయడంతో జీవన్ రెడ్డి అనుచరులు భగ్గుమన్నారు. కాంగ్రెస్ పార్టీలో మొదటి నుంచి ఉన్నామని.. జగిత్యాల అంటే జీవన్.. జీవన్ అంటే జగిత్యాల అనేలా మరో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే సంజయ్ ఫ్లెక్సీ పైన దీనిని ఏర్పాటు చేశారు. ఇలా సంజయ్, జీవన్ రెడ్డి వర్గాల మధ్య ఫ్లెక్సీల వార్ కొనసాగుతోంది. అభివృద్ధి కోసం పార్టీలో చేరామని ఒకరు అంటుంటే.. మరొకరు కాంగ్రెస్ పార్టీ అంటేనే జీవన్ రెడ్డి అంటున్నారు. అలకబూనిన జీవన్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హైకమాండ్ పెద్దలు మాట ఇచ్చినట్టు తెలుస్తోంది. త్వరలో మంత్రివర్గ విస్తరణ జరగనుండటంతో జీవన్ రెడ్డికి మంత్రి పదవి రావొచ్చని రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.

# కెసిఆర్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ

ఏజీకి ధర్మాసనం సూచించింది. ఏజీ వాదనలపై కేసీఆర్ న్యాయవాది ఆదిత్యా సోంధీ అభ్యంతర వ్యక్తం చేశారు. జ్యుడిషియల్ విచారణగా నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. దానిపై నివేదిక ఇవ్వాలే గానీ, మీడియాకు వివరాలు వెల్లడించకూడదు. విద్యుత్ రంగానికి తీవ్ర నష్టం వాటిల్లిందని ముందే చెప్పి కారకులెవరో తేల్చమన్నారు. ఇది సరికాదు అని ఆదిత్యా సోంధీ పేర్కొన్నారు. విద్యుత్తు కొనుగోళ్లు, థర్మల్ ప్లాంట్ల నిర్మాణంపై జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నేతృత్వంలో విచారణ సంఘం ఏర్పాటును సవాల్ చేస్తూ కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌కు నంబర్ కేటాయించాలని హైకోర్టు గురువారం నిర్ణయించిన సంగతి తెలిసిందే. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం హైకోర్టు రిజిస్ట్రీకిఆదేశాలు జారీచేసింది. విద్యుత్తు వ్యవహారాలపై రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 14న జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నేతృత్వంలో విచారణ సంఘాన్ని నియమించింది. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్–తెలంగాణ మధ్య విద్యుత్తు కొనుగోలు ఒప్పందాల్లో అక్రమాలు జరిగాయని ప్రభుత్వం ఆరోపించింది. కమిషన్ ఏర్పాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కేసీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విద్యుత్తుశాఖ ముఖ్య కార్యదర్శిని, జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి విచారణ సంఘాన్ని, వ్యక్తిగత హోదాలో జస్టిస్ ఎల్ నరసింహారెడ్డిని ఇందులో ప్రతివాదులుగా పేరొన్నారు. అయితే, జస్టిస్ నరసింహారెడ్డిని ప్రతివాదిగా చేర్చడంపై హైకోర్టు రిజిస్ట్రీ అభ్యంతరం తెలిపారు. నంబర్ కేటాయించేం దుకు నిరాకరించారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ పిటిషన్ గురువారం హైకోర్టు ధర్మాసనం ముందుకు వచ్చింది. దాదాపు 45 నిమిషాలపాటు వాదప్రతివాదనలు జరిగాయి. కేసీఆర్ తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది అదిత్య సోంధి బలంగా వాదనలు వినిపించారు. ఆయనతో ఏకీభవించిన ధర్మాసనం.. హైకోర్టు రిజిస్ట్రీ లేవనెత్తిన అభ్యంతరాలను తోసిపుచ్చింది. పిటిషన్‌కు నంబర్‌ను కేటాయించాలని ఆదేశించింది. జస్టిస్ నరసింహారెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ పిటిషనర్ అభియోగాలు మోపిన నేపథ్యంలో, పిటిషన్‌పై శుక్రవారం విచారణ చేపడతామని వెల్లడించిన మేరకు విచారణ జరిగింది.

# ప్రజావాణికి భారీగా వినతులు

## స్వీకరించిన చిన్నారెడ్డి

హైదరాబాద్,జూన్ 28**తెలంగాణ ముచ్చట్లు :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్ లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డా.చిన్నారెడ్డి పాల్గొని దరఖాస్తులను స్వీకరించారు. వివిధ సమస్యలతో వచ్చిన ప్రజలు చిన్నారెడ్డిని, ప్రజాభవన్ అధికారులను కలిసి వినతి పత్రాలు అందచేశారు. శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 494 దరఖాస్తులు అందాయి. రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 125, హౌసింగ్ కు సంబంధించి 43 దరఖాస్తులు, పౌరసరఫరాల శాఖ కు సంబందించి 71, హోం శాఖకు సంబందించి 45 దరఖాస్తులు, పంచాయతి రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ కు సంబందించి 47, ఇతర శాఖలకు సంబంధించి 48 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. ప్రజావాణి ప్రత్యేక అధికారి శ్రీమతి దివ్య ఇతర అధికారులు ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను స్వీకరించండం తో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

# ఉపాధ్యాయులన వెంటనే నియమించండి

## రోడ్డెక్కి నిరసన తెలపిన శాలిపేట విద్యార్థులు

మెదక్,జూన్28**తెలంగాణ ముచ్చట్లు :** మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం పరిధిలోని శాలిపేట ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని విద్యార్థులు పేర్కొన్నారు. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా కొత్తగా ఉపాధ్యాయులను నియమించండంటూ విద్యార్థులు రోడ్డెక్కి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రోడ్డుపైనే వంటావార్పు చేస్తూ నిరసనలు తెలిపారు. ఉపాధ్యాయులను నియమించే వరకు రోడ్డుపైనే తమ నిరసన కొనసాగుతుందని విద్యార్థులు తేల్చిచెప్పారు. శాలిపేట ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ఇద్దరు మాత్రమే స్కూల్ అసిస్టెంట్లు ఉన్నారు. అయితే విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులు లేరని వెంటనే ప్రభుత్వ అధికారులు చర్యలు తీసుకొని తమకు ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులకు విద్యాబోధన సక్రమంగా కొనసాగేటట్టు చూడాలని వారి తల్లిదండ్రులు కోరారు. గవలపల్లి ? రామాయంపేట రోడ్డుపై విద్యార్థులు బైఠాయించారు. టీచర్లు కావాలని ప్లకార్డులు ప్రదర్శించి నిరసనలు తెలిపారు.

## టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాలు విడుదల

రూ. 500 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. రీకౌంటింగ్ కోసం జులై 8వ తేదీ లోపు ఎస్బీఐ బ్యాంక్ ద్వారా చలాన్ చెల్లించాలి. ఆ చలాన్‌తో పాటు దరఖాస్తును ఎస్సెస్సీ బోర్డులో సమర్పించాలి. డిమాండ్ డ్రాఫ్టులు అంగీకరించబడవు అని అధికారులు స్పష్టం చేశారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి పివి

గర్వపడాల్సిన పీవీ నరసింహారావు అందించిన స్ఫూర్తి మరువలేనిదని తెలిపారు. కాగా, మౌనమునిగా పేరుగాంచిన పీవీ నరసింహారావు.. దేశానికి ఎనలేని సేవలు చేసినప్పటికీ కాంగ్రెస్ పాలకులు ఆయనను విస్మరించారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం పీవీకి సముచిత గౌరవాన్నిచ్చింది. ఆయన ఖ్యాతిని యావత్తు దేశానికి, ప్రపంచానికి చాటేందుకు తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఎనలేని కృషి చేశారు. మహనీయుడి చరిత్ర మరుగున పడిపోతున్న తరుణంలో 'పీవీ మన తెలంగాణ ఠీవీ' అంటూ నరసింహారావు ఖ్యాతిని మరోసారి ఎలుగెత్తిచాటారు. ఆయన జయంతి, వర్ధంతి కార్యక్రమాలను బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. ఏడాది పాటు ఘనంగా శత జయంతి ఉత్సవాలు జరిపింది.

# ఘనంగా పివి జయంతి వేడుకలు

కేటీఆర్ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి జగదీష్ రెడ్డి, మహమూద్ అలీ, పీవీ కూతురు ఎమ్మెల్సీ వాణి దేవి , మాలోత్ కవిత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. భారతదేశ చరిత్ర ఉన్నంత కాలం పీవీ చరిత్ర నిలిచి ఉంటుందని పేర్కొన్నారు. పీవీ నరసింహా రావు గొప్ప సంస్కరణల శీలి అని తెలిపారు. భూ సంస్కరణలో భాగంగా తన కుటుంబానికి చెందిన 800 ఎకరాలను మహనీయులు దారాదత్తం చేశారన్నారు. జైళ్ల శాఖ మంత్రిగా కూడా ఓపెన్ జైల్ విధానంతో సంస్కరణలు చేశారన్నారు. మైనార్టీ ప్రభుత్వాన్ని సైతం పూర్తికాలం సమర్థవంతంగా నడిపారన్నారు. పీవీ గొప్పతనాన్ని గుర్తించి భారత రత్న ప్రకటించిన కేంద్రానికి కేటీఆర్ అభినందనలు తెలిపారు. కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌లో పివికి మంత్రి పొన్నం ప్రభాకర్ నివాళి అర్పించారు. ఆయన చిత్రపటం వద్ద పుష్పాంజలి ఘటించారు. పివి దార్శనికత వల్లనే దేశం ఆర్థికంగా ఎదిగిందని అన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
TELTEL12273
తెలుగు దిన పత్రిక
శనివారం 29 -06- 2024
వరంగల్




# వంగర పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన ఎసిపి

భీమదేవరపల్లి తెలంగాణ ముచ్చట్లు :హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం లోని వంగర పోలీస్ స్టేషన్ ను కాజీపేట ఏసిపి తిరుమల్ అకస్మిక తనికి చేయడం జరిగినది ఇట్టి తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలు, పోలీస్ స్టేషన్ ఎస్సై రూము స్టాఫ్ రూమ్, రైటర్ రూము, రికార్డు రూమ్స్ ,మరియు బాత్రూమ్స్ అన్ని క్షుణ్ణంగా పరిశీలించడం జరిగినది. మరియు పోలీస్ స్టేషన్ రికార్డ్స్, సన్నిహిత జనరల్ డైరీ,కేడి,డీసి, రౌడీ షీట్స్, అన్ని రికార్డ్స్ పరిశీలించి సూచనలు ఇవ్వడం జరిగినది.మరియు పోలీస్ స్టేషన్లో ఉన్న సీసీ కెమెరాలు అన్ని పనిచేస్తున్నవా లేదా అని తనిఖీ చేయడం జరిగినది. సిబ్బందితో మాట్లాడి డ్యూటీ విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలి ప్రజల దరఖాస్తుదారుల మంచిగా రిసీవ్ చేసుకుని సరైన న్యాయం చేయగలరని, ప్రతి దరఖాస్తుదారుని సమస్యను తత్వరలో పరిష్కరించవలెను. ప్రజల సమస్యలు మన సమస్యలుగా అనుకోని తగు న్యాయం చేయవలెను. దరఖాస్తుదారులను ఎక్కువ రోజులు పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పకూడదు.అవసరమైన వాటికి చట్టపరంగా కేసులు నమోదు చేయవలెను. ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలని సూచించడం జరిగినది. సిబ్బందితో మాట్లాడి వారి వ్యక్తిగతమైన సమస్యలు, కుటుంబ సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగినది. సిబ్బంది శాఖ పరమైన సమస్యలు గానీ, శాఖ పరంగా రావాల్సిన లావాదేవీలు గాని ఉంటే తెలియపరచాలని కోరడము జరిగినది. ఇట్టి ఆకస్మిక తనిఖీలు చేసిన ఏసీపి వెంట ఎల్కతుర్తి సీఐ,ప్రవీణ్ పాల్గొనడం జరిగినది

# వంగర పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన ఎసిపి



భీమదేవరపల్లి తెలంగాణ ముచ్చట్లు : హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం లోని వంగర పోలీస్ స్టేషన్ ను కాజీపేట ఏసిపి తిరుమల్ అకస్మికతనికి చేయడం జరిగినది ఇట్టి తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలు, పోలీస్ స్టేషన్ ఎస్సై రూము స్టాఫ్ రూమ్, రైటర్ రూము, రికార్డు రూమ్స్ ,మరియు బాత్రూమ్స్ అన్ని క్షుణ్ణంగా పరిశీలించడం జరిగినది. మరియు పోలీస్ స్టేషన్ రికార్డ్స్, సన్నిహిత జనరల్ డైరీ,కేడి,డీసి, రౌడీ షీట్స్, అన్ని రికార్డ్స్ పరిశీలించి సూచనలు ఇవ్వడం జరిగినది.మరియు పోలీస్ స్టేషన్లో ఉన్న సీసీ కెమెరాలు అన్ని పనిచేస్తున్నవా లేదా అని తనిఖీ చేయడం జరిగినది. సిబ్బందితో మాట్లాడి డ్యూటీ విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలి ప్రజల దరఖాస్తుదారుల మంచిగా రిసీవ్ చేసుకుని సరైన న్యాయం చేయగలరని, ప్రతి దరఖాస్తుదారుని సమస్యను తత్వరలో పరిష్కరించవలెను. ప్రజల సమస్యలు మన సమస్యలుగా అనుకోని తగు న్యాయం చేయవలెను. దరఖాస్తుదారులను ఎక్కువ రోజులు పోలీస్ స్టేషన్ చుట్టూ తిప్పకూడదు.అవసరమైన వాటికి చట్టపరంగా కేసులు నమోదు చేయవలెను. ప్రజలతో సత్సంబంధాలు పెంచుకోవాలని సూచించడం జరిగినది. సిబ్బందితో మాట్లాడి వారి వ్యక్తిగతమైన సమస్యలు, కుటుంబ సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగినది. సిబ్బంది శాఖ పరమైన సమస్యలు గానీ, శాఖ పరంగా రావాల్సిన లావాదేవీలు గాని ఉంటే తెలియపరచాలని కోరడము జరిగినది. ఇట్టి ఆకస్మిక తనిఖీలు చేసిన ఏసీపి వెంట ఎల్కతుర్తి సీఐ,ప్రవీణ్ పాల్గొనడం జరిగినది.

# సీతారామ ఎత్తిపోతల పథకం పంపు హౌస్ ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు : అశ్వాపురం మండలంలోని బిజీ కొత్తూరు సమీపంలో గల సీతారామ ఎత్తిపోతల పథకం పంప్ హౌస్ ను శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సందర్శించారు. ఈ సందర్భంగా పంప్ హౌస్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఆయనకు మ్యాప్ ద్వారా ప్రాజెక్టుకు సంబంధించిన వివరాలను వివరించారు. ఈ పంపు ద్వారా 1500 క్యూసెక్కుల నీరు వస్తుందని,భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 4 పంపుల ద్వారా 104 కిలోమీటర్లు నీరు పంపుటకు ప్రధాన కాలువ సిద్ధంగా ఉందని, ఆగస్టు మాసంలో నీరు విడుదల చేయుటకు అన్ని పనులు పూర్తి చెయ్యాలని అధికారులను ఆదేశించారు. ఈ కాలువకు ఏన్కూరు వద్ద నాగార్జునసాగర్ కాలువకు అనుసంధానం చేయబడుతుందని తెలిపారు.తద్వారా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో1.20 లక్షల ఎకరాలకు మొదటి విడతగా నీటి లభ్యత కల్పించబడును.ఈ విధంగా రాబోయే మూడు సంవత్సరాలలో విడతల వారీగా సీతారామ ఎత్తిపోతల పథకం పూర్తి చేసి ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలలో6.74 లక్షల ఎకరాలకు నీరు అందించబడునని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ శ్రీనివాస్ రెడ్డి సూపరిండెంట్ ఇంజనీర్లు వెంకటేశ్వర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి మరియు కార్యనిర్వాహక ఇంజనీర్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# యువత మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకుని, ఉద్యోగావకాశాలు పొందాలి

## -అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్








ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :యువత మెగా జాబ్ మేళాను సద్వినియోగం చేసుకుని, ఉద్యోగావకాశాలు పొందాలని అదనపు కలెక్టర్ డి. మధుసూదన్ నాయక్ అన్నారు. శుక్రవారం కూసుమంచి మండలం పాలేరు లోని బి.వి. రెడ్డి ఫంక్షన్ హాల్లో తెలంగాణ యువజన సర్వీసుల శాఖ, టిజిఎస్ టిఇపి, హైదరాబాద్ ల ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను అదనపు కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేలాదిమంది యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు వివిధ కంపెనీలు మెగా జాబ్ మేళా ను నిర్వహించడం చాలా సంతోషంగా ఉందని, మెగా జాబ్ మేళాకు వచ్చినవారు ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. హైదరాబాద్, వరంగల్ తో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన 65 పైగా కంపెనీలు, 5000 పైగా ఉద్యోగావకాశాలను కల్పించేందుకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నాయని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఒక ఫ్రెషర్ కి ఆఫ్ క్యాంపస్ ద్వారా ఇది మంచి అవకాశమని అన్నారు. ఎక్కడ అవకాశాలు ఉంటే, అక్కడకి వెళ్ళడానికి సిద్ధంగా ఉండాలని, వచ్చిన ఏ చిన్న అవకాశమైనా విడిచి పెట్టక, ఒక్కో మెట్టు ఎదుగుతూ, లక్ష్యం చేరాలన్నారు. ప్రతి ఉద్యోగం ఒక పాఠం వంటిదని, ప్రతి ఉద్యోగంలో ఎంతో నేర్చుకోవచ్చని, నైపుణ్యం, అనుభవం పొంది కెరీర్ పరంగా ఎదగాలన్నారు. ఇప్పుడు పొందే ఉద్యోగాలతో ఉపాధి పొందుతూ, మన కాళ్ళ మీద మనం నిలబడి, ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధం కావాలన్నారు. యువత, విద్యార్థులు అర్హతలను బట్టి ఉద్యోగావకాశాలను పొందాలన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చేతుల మీదుగా మెగా జాబ్ మేళాలో ఆర్డర్ పొందిన ఆఫర్ లేటర్లను అందజేశారు. ఇట్టి మెగా జాబ్ మేళా కు 2014 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా, వివిధ కంపెనీలకు 571 మంది యువత ఎంపికయి, నియామక ఉత్తర్వులు పొందారని, 1043 మంది యువత మొదటి రౌండ్ ఇంటర్వ్యూ పూర్తి చేసుకొని, రెండో రౌండ్ ఇంటర్వ్యూకి అర్హత పొందినట్లు అదనపు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఉద్యోగార్థులకు శుభాభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పి సిఇఓ ఎస్. వినోద్, జిల్లా యువజన సర్వీసులు, క్రీడల అభివృద్ధి అధికారి సునీల్ రెడ్డి, జిల్లా పౌరసంబంధాల అధికారి ఎం.ఏ. గౌస్, కూసుమంచి ఎంపిపి బి. శ్రీనివాస్, ఎంపిడిఓ వేణుగోపాల్ రెడ్డి, సిఐ జనార్దన్, వివిధ కంపెనీల ప్రతినిధులు, ఉద్యోగార్థులు పాల్గొన్నారు.





# నూతన ఆర్థిక విధానాల రూపశిల్పి పీవీ నరసింహారావు

## - జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు దుర్గా ప్రసాద్

ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు : జిల్లా కాంగ్రెస్ కార్యాలయం సంజీవరెడ్డి భవన్ లో జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ , రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మెన్ రాయల నాగేశ్వరరావు, నగర కార్పొరేషన్ మేయర్ పునుకొళ్ళు నీరజ లు దివంగత నేత భారతదేశ మాజి ప్రధాని స్వర్గీయ శ్రీ పి వి నరసింహారావు జయంతి ని పురస్కరించుకొని వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటి అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ....బహుభాషా కోవిదుడు నూతన ఆర్థిక విధానాల రూపశిల్పి పీవీ నరసింహారావు అని అన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్ట పరిచేందుకు ఆయన చేసిన కృషి మరువలేనిదని కొనియాడారు. అనతరం నగర కార్పొరేషన్ మేయర్ పుణుకొల్లు నీరజ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మెన్ రాయల నాగేశ్వరరావు లు మాట్లాడుతూ..తెలంగాణ ముద్దు బిడ్డగా ప్రధాన మంత్రి హెూదాలో ఆయాన దేశానికి చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వీరితో పాటు రాష్ట్ర ఓ బి సి సెల్ ఉపాధ్యక్షులు వడ్డేబోయిన నరసింహారావు, రాష్ట్ర మైనారిటీ ఉపాధ్యక్షులు బి హెచ్ రబ్బానీ,జిల్లా ఐ ఎన్ టి యు సి, మైనారిటీ, ఏస్ సి సెల్ అద్యక్షులు కొత్తా సీతారాములు,సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, బొడ్డు బొందయ్య, కార్పొరేటర్లు మలీదు వేంకటేశ్వర్లు, దుద్దుకూరి వేంకటేశ్వర్లు, లకావత్ సైదులు నాయక్, రాపర్తి శరత్, ఆళ్ళ అంజిరెడ్డి, రఘునాథపాలెం మండల అధ్యక్షులు భూక్యా బాలాజి నాయక్,జిల్లా ఓ బి సి సెల్ ఉపాధ్యక్షులు గజ్జెల్లి వెంకన్న, గజ్జి సూర్యనారాయణ, జిల్లా నాయకులు శెట్టి రంగారావు, ఎండి వై పాషా, నగర కాంగ్రెస్ నాయకులు బీరెడ్డి రమేశ్, గడ్డం వెంకటయ్య, రజి, కొలిపొంగు రమేశ్, శ్రీదేవి, ప్రతిభారెడ్డి, సంపటం నరసింహారావు, వాసిమ్ ,తవిడబోయిన రవి,భూక్యా సురేష్ నాయక్, గాదర్ బాబు, నూకారపు వేంకటేశ్వర్లు, మహమ్మోద్, కాసిబోయిన శ్రీను, జయ బాబు తదితర నాయకులు పాల్గొన్నారు.




# పాఠశాలలను తనిఖీ చేసిన డిప్యూటీ డి ఈవో ప్రసాద్ రావు

లింగసముద్రం, మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పెదపవని ,గురుకుల పాఠశాల పెదపవనిని డిప్యూటీ డిఈ ఓ ఎం వి ప్రసాదరావు శుక్రవారం సందర్శించారు. గురుకుల పాఠశాల 9వ తరగతి విద్యార్థులు వ్రాయుచున్న పరీక్షను పరిశీలించారు.విద్యార్థుల ఖాళీలను వివరాలను తెలుసుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి ఉపాధ్యాయుల సమావేశం ఏర్పాటు చేశారు నేను బడికి వస్తా కార్యక్రమం గురించి అనగా చిల్డ్రన్ ఎన్రోల్మెంట్ ప్రోగ్రాం సంబంధించిన అంశాలను ఉపాధ్యాయులు తెలుసుకుని ఉండాలని తెలిపారు. టెన్త్ క్లాస్ విద్యార్థుల ఫలితాల గురించి చర్చించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు పాఠశాల క్రీడా ప్రాంగణం లో జరిగే ఆటల వివరాలను పిడి కృష్ణ ద్వారా తెలుసుకున్నారు, హెడ్మాస్టర్ టి శ్రీనివాస్ ద్వారా పాఠశాల సమాచారాన్ని తెలుసుకున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL12273
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక

# బిజెపి పాలనలో పెరుగుతున్న ఆర్థిక అంతరాలు

## - మతోన్మాదులను హెచ్చరించిన ఎన్నికల ఫలితాలు
## - విస్తృతి, బలోపేతమే లక్ష్యంగా కార్యాచరణ
## - సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో జాతీయ కార్యదర్శి నారాయణ







ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు :బిజెపి పాలనలో దేశంలో ఆర్థిక అంతరాలు పెరిగిపోతున్నాయని అతి కొద్ది మంది చేతుల్లో దేశ సంపద పోగుబడుతుందని సిపిఐ జాతీయ కార్యదర్శి కె. నారాయణ ఆరోపించారు. భవిష్యత్తులో భారత ఆర్థిక -వ్యవస్థ కొందరి గుప్పెట్లో చేరడం ద్వారా ఆర్థికంగా దేశం ఇబ్బందికర పరిస్థితులను ఎదుర్కొవాల్సి వస్తుందని -ఆయన హెచ్చరించారు. సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం ఖమ్మం గిరిప్రసాద్ భవన్లో పోటు ప్రసాద్ అధ్యక్షతన జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన నారాయణ మాట్లాడుతూ కార్పొరేట్ శక్తులు, మోడీ అనుకూల సంస్థలు కోట్లాది రూపాయల ప్రజా ధనాన్ని కూలగోడుతుంటే మరో పక్క పేదలు మరింత పేదలు -అవుతున్నారని ఆయన ఆరోపించారు. ప్రపంచంలో పేదరికం గణనీయంగా పెరుగుతున్న దేశాల్లో భారతదేశం కూడా ఒకటన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ ఒక కుదుపుకు గురవుతుంటే ప్రధాని మోడీ మాత్రం అబద్దాలు చెబుతూ దేశం ఆర్థికంగా వెలిగిపోతుందని ప్రధాని మోడీ చంకలు గుద్దుకుంటున్నారని కాని వాస్తవ పరిస్థితులు ఇందుకు -విరుద్దంగా ఉన్నాయని నారాయణ తెలిపారు. పార్లమెంటు ఎన్నికల్లో బిజెపి గెలిచినప్పటికీ దాని పరిస్థితి చావు తప్పి కన్ను లోట్టబోయినట్లయిందని ఆయన తెలిపారు. బిజెపి 400 సంఖ్య ఎందుకు రాలేదో అర్థం చేసుకోవాలన్నారు. -మతోన్మాద శక్తులకు ఈ ఎన్నికలు ఒక గుణపాఠం లాంటివని ఏ మతాన్ని చూపి లబ్ది పొందాలని బిజెపి ప్రయత్నించిందని ఆయన తెలిపారు. అయోధ్య రామాలయాన్ని చూపి ఓట్లు దండుకోవాలని చూస్తే చివరకు రామాలయం ఉన్న ఎంపి స్థానం పైజాబాద్ను బిజెపి కోల్పోయిందన్నారు. ఈ ఎన్నికలు మతోన్మాద శక్తులకు ఒక హెచ్చరిక లాంటివని నారాయణ తెలిపారు. బలమైన ప్రతిపక్షం లోక్సభలో ఉండడాన్ని సిపిఐ స్వాగతిస్తుందని -ఆయన తెలిపారు. రాష్ట్రంలో ప్రధాన సమస్యల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి సారించాలని నారాయణ -సూచించారు.

రైతుబంధు, రుణమాఫీ తో పాటు ఇతర ప్రజా సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు. బొగ్గు బ్లాకుల వేలాన్ని అడ్డుకునేందుకు జరుగుతున్న పోరాటాల్లో కాంగ్రెస్ పార్టీ ముందు వరుసలో నిలవాలన్నారు. కేంద్రాన్ని నిలువరించేందుకు ఇది సరైన మార్గమని ఆయన అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోను బొగ్గు బావుల ప్రైవేటీకరణను అడ్డుకుంటామని బొగ్గు బ్లాకుల వేలం పాటలను తక్షణం నిలుపుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భారత కమ్యూనిస్టు పార్టీ విస్తరణ బలోపేతం పై దృష్టి సారించనున్నామని నారాయణ తెలిపారు. గ్రామశాఖల బలోపేతమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించనున్నామన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ క్యాడర్ను సంసిద్ధం చేస్తున్నామని ఆయన తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టగా ఈ సమావేశంలో సిపిఐ జాతీయ కార్యదర్శి అజీజాపాషా, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ప్రతినిధులు ఎప్పటికీ ప్రజా సేవకులు

## - 119 నియోజకవర్గాల్లో వనపర్తిని ముందంజలో నిలిపేందుకే ప్రత్యేక దృష్టి
## - సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులను సన్మానించిన ఎమ్మెల్యే



వనపర్తి జిల్లా ప్రతి తెలంగాణ ముచ్చట్లు: పదవీకాలం తాత్కాలికమని ప్రజా ప్రతినిధిగా ఒక్కసారి ఎన్నికైతే సమాజంలో ఎప్పటికీ ప్రజా సేవకుల గానే మిగిలిపోతామని ఎక్కడ ఎవరు అసంతృప్తి చెందకుండా ప్రజాక్షేత్రంలో ప్రజాసేవను చేస్తూనే ఉండాలని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. శనివారం పెద్దమందడి మండలం సర్వసభ్య సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే శాఖలపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు అప్రమత్తంగా పనిచేయాలని సాగు చేసిన పంటలను పక్కాగా నమోదు చేయించాలని సాగుచేసిన ప్రతి రైతు ప్రభుత్వం తరపున లబ్ధి పొందేలా చూడాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ప్రభుత్వం మిషన్ భగీరథ పేరున ప్రజాధనం వృధా చేసింది తప్ప ప్రజలకు తాగునీటి సమస్యలు తీర్చలేదని నేడు నియోజకవర్గంలో కేవలం తాగునీటి సమస్యలు పరిష్కరించేందుకే 3కోట్ల 60 లక్షలు ప్రత్యేకంగా కేటాయించామని అధికారులు తాగునీటిపరంగా ఉన్న సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కరించాలని ఆయన సూచించారు. ఇట్లు సమస్యలను పరిష్కరించి రైతులకు అత్యవసరమైన సేవలపట్ల విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. సీజనల్ వ్యాధులపై వైద్యాధికారులు ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు గ్రామాల్లో పర్యవేక్షిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని సీజనల్ వ్యాధులను సంక్రమించకుండా తగు చర్యలు చేపట్టాలని వైద్యాధికారులకు ఎమ్మెల్యే సూచించారు. పంచాయతీరాజ్ శాఖ పరంగా నియోజకవర్గం లోని అన్ని గ్రామాలపై దృష్టి సారించి గుర్తించి బాగు చేయించాలని ఎమ్మెల్యే సూచించారు. గ్రామాల్లో పనిచేసే శానిటేషన్ వర్కర్లకు వేతనాలు క్రమం తప్పకుండా అందించాలని ఎక్కడ జాప్యం రాకుండా చూసుకోవాలని ఆయన ఆదేశించారు. పార్టీలకతీతంగా పనిచేసే నియోజకవర్గం ను అన్ని రంగాలలో ముందు ఉంచాలని ఎమ్మెల్యే సూచించారు. పదవీకాలం ముగుస్తున్న సందర్భంగా ఎంపీటీసీలకు చేపట్టిన సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని శాలువాలు పూలమాలలతో వారిని సన్మానించారు. కార్యక్రమంలో పెద్దమందడి ఎంపిపి రఘు ప్రసాద్, జిల్లా పరిషత్ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, జడ్పీటీసీ రఘుపతి రెడ్డి, వైస్ ఎంపీపీ భారతి ఎంపీడీవో సద్గుణ, సింగిల్ విండో అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు ప్రజాప్రతిని అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బొగ్గు గనులను సింగరేణి సంస్థకే కేటాయించాలి

## -సిపిఎం డిమాండ్

ఉమ్మడి ఖమ్మం బ్యూరో చీఫ్ తెలంగాణ ముచ్చట్లు : కేంద్ర బిజెపి ప్రభుత్వం బొగ్గు గనుల వేలం పాటను ఆపి సింగరేణికి నేరుగా కేటాయించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు శుక్రవారం స్థానిక సరిత క్లినిక్ సెంటర్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు యర్రా శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సభలో నున్నా మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును కేంద్ర బిజెపి ప్రభుత్వం వేలంపాటను వేస్తున్నదని సింగరేణి కంపెనీ కూడా ప్రైవేట్ సంస్థలతో వేలం పాటలో పోటీపడాలనే స్థితికి కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని విమర్శించారు. వాస్తవానికి శ్రావణపల్లిలో సింగరేణి సంస్థ బొగ్గు తవ్వాలి. కానీ వేలంపాట ద్వారా ప్రైవేట్ సంస్థలకు అవకాశం కల్పించి బొగ్గు గనులను కేటాయించడం సరైంది కాదన్నారు. మన రాష్ట్రం నుంచి బొగ్గు గనుల శాఖ మంత్రిగా ఉన్న కిషన్ రెడ్డి హైదరాబాద్ కేంద్రంగా వేలంపాటను ప్రారంభించడం సిగ్గుచేటని అన్నారు. బొగ్గు గనులన్నీ ప్రైవేటు సంస్థలకు ఇచ్చిన తర్వాత సింగరేణికి మిగిలేదేముంటుందని ప్రశ్నించారు. ప్రైవేటీకరణ వలన క్రమంగా సింగరేణి సంస్థను బలహీనపరిచి నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తుందని అన్నారు.

నగదీకరణ పేరుతో దేశంలో ఆరు లక్షల కోట్ల విలువైన ఆస్తులను కేంద్ర ప్రభుత్వం ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టిందని. అందులో భాగంగానే కోట్ల విలువైన గనులను ప్రైవేటు సంస్థలకు ఇవ్వాలని నిర్ణయాన్ని తీసుకుందని విమర్శించారు. గత పది సంవత్సరాలలో కేంద్ర ప్రభుత్వం దాదాపుగా 200 బొగ్గు బావులను ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టారని, ప్రభుత్వ రంగంలో గనులు లేకపోతే యువతకు ఉపాధి అవకాశాలు కనుమరుగవుతాయి అని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ ఎంపీలు ఉండి కూడా బొగ్గు గనుల వేలాన్ని అడ్డుకోలేకపోయారని విమర్శించారు. ప్రస్తుతం సింగరేణి 40 వేల మంది పర్మినెంట్ కార్మికులకు, మరో 26 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నదని, రికార్డు స్థాయిలో అతి తక్కువ ధరకే నాణ్యమైన బొగ్గును ఉత్పత్తి చేస్తున్న ఘనత సింగరేణి సంస్థకే చెందుతుందని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అనేక రూపాలలో ఆదాయాన్ని తీసుకొస్తున్న సింగరేణిని ప్రైవేటీకరణ అప్పజెప్పి ప్రభుత్వ ఉపాధి అవకాశాలను కొల్లగొడుతున్న కేంద్ర ప్రభుత్వ ధమననీతిని రాష్ట్ర ప్రజానీకం ఖండిరచాలని అన్నారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణ వేగంగా జరిగితే విద్యుత్తు ధర విపరీతంగా పెరుగుతుందని అన్నారు. సింగరేణికి చెందిన 22 బొగ్గు బావుల్లో బొగ్గు నిల్వలు అడగండి పోయాయని కొత్త బ్లాకులో తవ్వకాలు ప్రారంభించాలని కానీ కేంద్ర బీజేపీ ప్రభుత్వం ఇందుకు అనుమతించకుండా మోకాలు అడ్డుతున్నదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల తెలంగాణ ప్రజానీకానికి తీవ్ర అన్యాయం జరుగుతుందని వేలంపాట ప్రారంభ కార్యక్రమంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో పాటు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొనటం ఆశ్చర్యకరమని ఇది వేలంపాట ప్రక్రియను ఆమోదించడమే కదా అని ఆయన అన్నారు. కాబట్టి శ్రావణపల్లి బ్లాకుతో పాటు మిగతా బ్లాక్‌లను కూడా తక్షణమే సింగరేణికి అప్పగించాలని ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్షాన్ని కలుపుకొని కేంద్రం మీద ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. అందుకు అనుగుణంగా రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకొని శాసనసభ తీర్మానం చేయాలని లేని పక్షంలో ప్రజానీకాన్ని కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రం, సింగరేణి బొగ్గుగని కాంట్రాక్టు కార్మికుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధు, సి పి ఎం రాష్ట్ర నాయకులు తాళ్ళ నాగరాజు, జిల్లా కమిటి సభ్యులు మాదినేని రమేష్, యర్రా శ్రీనివాసరావు, మెరుగు సత్యనారాయణ, ఎస్.కె.బషీరుద్దీన్, ఆర్.ప్రకాష్, పార్టీ 2 టౌన్ కార్యదర్శి బోడపట్ల సుదర్శన్, 3 టౌన్ కార్యదర్శి భూక్యా శ్రీను, అర్బన్ మండల కార్యదర్శి బత్తిని ఉపేందర్, జిల్లా నాయకులు ఎస్.కె.వి.ఎ.మీరా, చింతల రమేష్, వజినేపల్లి శ్రీను, బండారు యాకయ్య, పి.నాగసులోచన, శీలం వీరబాబు, భాగం అజిత, బేగం, బూబి, పగడాల నాగేశ్వరరావు, సత్యనారాయణ, గణపతి, ఉమ్మినేని రాంబాబు తదితరులు పాల్గొన్నారు.








# పైరవి కారుల మాటలు నమ్మొద్దు

## - జులై మాసం తర్వాత కళ్యాణ లక్ష్మి, చెక్కుతో పాటు తులం బంగారం

## - కళ్యాణ లక్ష్మి, చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే తూడి మేఘూరెడ్డి

వనపర్తి జిల్లా ప్రతినిధి తెలంగాణ ముచ్చట్లు: వనపర్తి నియోజకవర్గంలో కళ్యాణ లక్ష్మి చెక్కులను ఇప్పిస్తామని చెబుతూ డబ్బులు వసూలు చేసే పైరవీ కారులను నమ్మకూడదని. నేను కాంగ్రెస్ ప్రభుత్వ ఆధ్వర్యంలో ప్రతి పని పారదర్శకంగా జరుగుతోందని ఎక్కడ ఎవరికి ఒక్క రూపాయి కూడా చెల్లించాల్సిన అవసరం లేదని వనపర్తి ఎమ్మెల్యే మేఘూరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం పెద్దమందడి మండల పరిధిలోని కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు మంజూరైన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ మండల పరిధిలోని పలు గ్రామాలకు చెందిన 36 మందికి షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి, చెక్కులు మంజూరయ్యాయని, పెండింగ్ లో ఉన్న మరో 105 చెక్కులను త్వరలోనే అందిస్తామని ఎంఎల్ఏ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలలోని ఆడబిడ్డల ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్క లబ్ధిదారునికి ఉండాలని ఆయన అధికారులకు సూచించారు కార్యక్రమంలో ఎంపీపీ రఘు ప్రసాద్, రఘుపతి రెడ్డి, వైస్ ఎంపీపీ భారతి, సింగిల్ విండోఅధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి ఎంపీడీవో సద్గుణ, ఎంపీటీసీలు మాజీ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

# రోగులను చక్కగా చూసుకోవాలి



కందుకూరు,తెలంగాణ ముచ్చట్లు : రోగులను చక్కగా చూసుకోవాలని ఎం ఎల్ ఏ డోరి నాగేశ్వరరావు అన్నారు. స్థానిక ప్రాంతీయ వైద్యశాలలో వైద్యుల సమీక్ష సమావేశం శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోగుల తో బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. వైద్యశాలకు గానీ, ప్రభుత్వానికి గానీ చెడ్డ పేరు తెచ్చేలా వ్యవహరించొద్దని పేర్కొన్నారు. సమయపాలన పాటించాలని అని వైద్యులు, సిబ్బందిలకుఆయన సూచన చేశారు. వైద్యశాలలోని ఆయా విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి వివరాలను తెలుసుకున్నారు. రోగులవద్దకు వెళ్లివారికి అందుతున్న సౌకర్యాలు, చికిత్స గురించి ఆరా తీశారు. రోగులకు అందిస్తున్న ఆహారం నాణ్యతగా ఉందా, లేదా అని ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు.రోగులకు సరిపడా మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలి – ఆసుపత్రిలోనే ఎక్కువ కాన్పులు జరిగేలా చూడాలి – అందుబాటులో ఉన్న అధునాతన పరికరాలు సక్రమంగా ఉపయోగించి రోగులకు సేవ చేయాలి – శానిటేషన్, త్రాగునీరు విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలిఅనిఆయన పేర్కొన్నారు . వైద్యశాలలో తగినంతమంది వైద్యులు, సిబ్బంది లేరన్న విషయం తనకు తెలుసని, వైద్య పరికరాల కొరత ఉందని వీటిపై వెంటనే సంబంధిత శాఖ మంత్రితో మాట్లాడి త్వరలోనే సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో వైద్యశాల పర్య వేక్షకురాలు డాక్టర్ ఇంద్రాణి, వైద్యులు పి. బి .కళ్యాణ్ , ధర్మ తేజ, తులసి రామ్, సుగుణ, హెూమియో, ఆయుర్వేద వైద్యులు రత్నవళి, లక్ష్మి కుమారి, పట్టణ టిడిపి అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, కందుకూరు మండల పార్టీ అధ్యక్షులు నార్నే రోశయ్య, పార్టీ నాయకులు చిలకపాటి మధు, చదలవాడ కొండయ్య, బెజవాడ ప్రసాద్, షేక్ రఫీ, ఇంకా పలువురు నాయకులు ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

# రోగులకు మెరుగైన సేవలు అందించడమే మా ధ్యేయం.

## - రెవ.శామ్యూల్ జాన్సన్

## - పండితవిల్లూరు ఐపిసిలో ఉచిత మెగా వైద్య శిబిరం







పోదూరు తెలంగాణ ముచ్చట్లు :ఆధ్యాత్మికంతోపాటు, అనారోగ్యం తో ఉన్న వారికి మెరుగైన వైద్య సేవలు అందించడమే మా ధ్యేయ మని పండితవిల్లూరు,ఇండియన్ పెంతు కోస్తు చర్చి సీనియర్ పాస్టర్ రెవరెండ్ గెడ్డం శామ్యూల్ జాన్సన్ అన్నారు. శుక్రవారం పండితవిల్లురు గ్రామంలోని ఐపీసీ చర్చి ఆవరణ ములో న్యూ లైఫ్ మినిస్ట్రీన్ ఆధ్వర్యంలో ఏలూరు ఆశ్రమం మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ మరియు మెడికల్ కాలేజీ వారిచే ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించబడినది. నిర్వాహకులు శామ్యూల్ జాన్సన్ మాట్లాడుతూ పండిత విల్లూరు కేంద్రంగా చుట్టుపక్కల గ్రామాలలో ని ప్రజలకు ఆధ్యాత్మిక కార్యక్రమాల తో పాటు, గత ముప్పై సంవత్స రాలుగా సామాజికపరమైన సేవలు, ముఖ్యంగా కరోనా సమయంలో బాధితులకు నిత్యవసరాలు పంపిణీ, ప్రతి సంవత్సరం మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్ వారిచే ప్రత్యేక మెగా వైద్య శిబిరాలు,అనాధ పిల్లలకు ఆశ్రయం,వృద్ధులకు, వితంతువులకు,వికలాంగులకు సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు.చవ్వాకుల భరత్ మాట్లాడుతూ రెవ. శామ్యూల్ జాన్సన్ ఐపీసీ చర్చి ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు.గుత్తుల సాల్మన్ దొర మాట్లాడుతూ ఆధ్యాత్మిక జీవపు దాత దేవుడని,దేవుని తర్వాత భౌతికంగా ప్రాణదాతలు డాక్టర్లని, కరోనా సమయంలో డాక్టర్లు, నర్సింగ్,తదితర మెడికల్ శాఖల సిబ్బంది ప్రాణాలు సైతం లెక్కచేయకుండా చేసిన కృషి వెలకట్టలేనిదని అన్నారు.అందులో భాగంగా 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఆశ్రమం హాస్పిటల్ డాక్టర్స్ వై.ఎన్.సాయికృష్ణ(జనరల్ మెడిసిన్),బి.అమృత (ఆప్తాలమాలజిస్ట్),డి.వెంకట్ (పీడియాట్రిక్స్),ఏ.భార్గవ్ (ఆర్థోపెడిక్).పావనిప్రియ(గైనకాలజిస్ట్),సంబంధిత శాఖల నర్సింగ్ సిబ్బంది రెండు వందల యాభై మందిని పరీక్షించి,అవసరమైన రోగులకు ఈసీజీ మరియు 2డి ఎకో,కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారందరికీ ఉచితంగా మందులు పంపిణీ చేశారు.మెరుగైన వైద్య సహాయం కావలసిన వారి నిమిత్తం శనివారం ఉచిత బస్సు సౌకర్యం కల్పించినట్లు పిఆర్వో సురేష్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐపిసి పాస్టర్ జి.శామ్యూల్ మోర్స్,పాస్టర్ సదమళ్ళ మేరీ శాంతి,రవికుమార్,స్థానిక టిడిపి నాయకులు నెక్కంటి సుబ్బారాయుడు,నామాల ఫణీంద్ర,ఐపీసీ యూత్,వాలంటీర్లు పాల్గొన్నారు.

# అందుబాటులో లేని పారిశుధ్య సామాగ్రిలు - ఎవ్వరిది ఈ లోపం

## పారిశుధ్యాని గాలికి వదిలేసిన అధికారులు



జగ్గయ్యపేట,తెలంగాణ ముచ్చట్లు :జగ్గయ్య పేట మున్సిపాలిటీ 31 వార్డులు,సుమారు 20 వేలు గడపలున్నాయి.మున్సిపాలిటీ పరిధిలో సుమారు 70 వేల మంది జనాభా నివసిస్తున్నారు.జగ్గయ్యపేట మున్సిపాలిటీ వార్డులలో సుమారు 20 కి పైబడి మురికి వార్డులలో జనాభా ఉన్నారు.ఏ మున్సిపాలిటీ అయిన సీజన్ వారీగా పారిశుధ్య నిర్వహణకి కావాల్సిన పారలు,గడ్డపలుకులు,కొడవళ్ళు,గొడలు,దంతెలు మరియు వీటికి కావాల్సిన కర్రలు మరియు మలాథిన్ ఆయిల్,మలాథిన్ బాల్స్,బీటి (ఇన్ సెక్ట్ సైడ్),బ్లీచింగ్, సున్నం సైతం అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది.కాని జగ్గయ్యపేట మున్సిపాలిటీ మాత్రం దీనికి భిన్నమనే చెప్పుకోవచ్చు.పారిశుధ్య నిర్వహణకోసంసీజన్దాటుతున్న నేటికిఅందుబాటులో లేవనేఆరోపణలు బలంగా వినిపిస్తు న్నాయి. సంబందిత శాఖ అధికారి మాత్రం వీటి మీద శ్రద్ధ పెట్టక పోవడం మూలానే జగ్గయ్యపేట ప్రజలు డయేరియా ఇతర రోగాల భారినపడుతున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి.దీనితో ఉన్నత స్థాయి అధికారులు సైతం పరిశీలనకి వచ్చినప్పుడుమాత్రమే ఈవిషయం వెలుగులోకి వచ్చిందని తెలుస్తుంది. అయినప్పటికి ఈ విషయం లో వచ్చిన అధికారులు చేతులు ఎత్తేశారనే చెప్పుకోవచ్చు.ఇప్పటికే పారిశుధ్యంలో ఇట్టువంటి సామాన్లు కొనుగోలులో గోల్మాల్ఏమైన జరిగాయేమోనని ప్రజలు నుండి గుసగుసలు వినిపిస్తున్నాయి.వాటి పై జిల్లాఅధికారులు విచారణ చేపట్టి సీజన్లో ప్రజారోగ్యాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

# ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేసిన కలెక్టర్ డా. కె.శ్రీనివాసులు

నంద్యాల, తెలంగాణ ముచ్చట్లు : ప్రతి శుక్రవారం ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించి క్లోరినేషన్ చేసిన నీటిని సరఫరా చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ కె. శ్రీనివాసులు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం నంద్యాల పట్టణంలోని ఎన్జీవో కాలనీలోని విశ్వనగర్ నందు ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని నిర్లక్ష్యం చేస్తే సంబంధిత సిబ్బందిపై కఠినమైన చర్యలు తీసుకుంటామని ఆదేశించారు. అలాగే దోమల లార్వాలు వృద్ధి చెందకుండా ప్రతి గ్రామంలో ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పటిష్టంగా నిర్వహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. డెంగ్యూ వ్యాధికి కారణమైన టైగర్ దోమలు మంచినీటి నిల్వ ఉన్నటువంటి ప్రదేశాలలో చేరి గుడ్లు పెట్టిన అనంతరం లార్వా మరియు పెద్ద దోమగా తయారై కుట్టడం జరుగుతున్న నేపథ్యంలో ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలన్నారు. దోమల ద్వారా వచ్చే డెంగ్యూ, చికెన్ గున్యా, మలేరియా, మెదడువాపు జ్వరాలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆశా వర్కర్లు, సచివాలయ ఆరోగ్య కార్యకర్తలు, వైద్య అధికారులు, మున్సిపల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిఎంఅండ్ హెచ్ఓ డాక్టర్ వెంకటరమణ, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, మలేరియా అధికారి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



# వివి పాలెం మండల ఏపిటి ఎఫ్ సభ్యత్వ నమోదు కార్యక్రమం

వలేటివారిపాలెం,తెలంగాణ ముచ్చట్లు :2024-25 విద్యా సంవత్సరం ఏపీటీఎఫ్ మండలంలో సభ్యత్వ నమోదు తో పాటుగాఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి తెలుసుకున్నారు. ఉపాధ్యాయుల పదోన్నతుల జాబితా సంబంధిత ఉప విద్యాశాఖ అధికారులు , మండల విద్యాశాఖ అధికారుల ద్వారా ఉపాధ్యాయుల వివరాలను తెప్పించుకొని సక్రమంగా సీనియారిటీ జాబితాలు తయారుచేసి వెంటనే పదోన్నతులు కల్పించాలని సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా డి ఈ ఓ కార్యాలయము చేయుచున్న సర్వీస్ రెగ్యులరైజేషన్ విషయంలో, నెల్లూరు జిల్లాలో కలిసిన డివిజన్ ఉపాధ్యాయులు సమస్యలు ఎదుర్కొంటున్నట్లుగా ఉపాధ్యాయులు చెప్పారు. సర్వీస్ మేటర్సు ప్రకాశం జిల్లా డి ఇ ఓ మాత్రమే చేయవలసి ఉన్నందున సదరు విషయాన్ని కి తెలియజేసి సమస్యను సానుకూలంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని ఏపీటీఎఫ్ నాయకులు ఏ వి రావు,సాంబశివరావు , శ్రీనివాసులు , ఐఫియా నాయకులు పీవీసుబ్బారావు తెలియజేశారు.

# అభివృద్ధి పనులను పరిశీలించిన ఉప్పల్ కార్పొరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి



ఉప్పల్ .హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఉప్పల్ ఓల్డ్ భరత్ నగర్ , మసీద్ దగ్గర జరుగుతున్న సిసి రోడ్ అభివృద్ధి పనులను ఉప్పల్ కార్పోరేటర్ రజిత పరమేశ్వర్ రెడ్డి పరిశీలించారు. సీసీ రోడ్డు పనులు జరుగుతున్న పనితీరు అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో %రాజు% వసంత , గొరిగే కృష్ణ,ఈగ అంజయ్య ,.ఈగ లక్ష్మణ్ , ఈగ సంతోష్ ,ఈగ శ్రీను.ఈగ శంకర్ . ఈగ మురళీ . సల్ల ప్రభాకర్ రెడ్డి. భాస్కర్ రెడ్డి. నవీన్ గౌడ్. హరి బాబూ. జితేందర్ రెడ్డి. కన్నమైన నరేష్ . వంశీ.త పాల్గొన్నారు.

# లారీని ఢీకొట్టిన మరో లారీ

## నలుగురు వ్యక్తుల దుర్మరణం

మెదక్, తెలంగాణ ముచ్చట్లు : మెదక్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాం జరిగింది. లారీని మరో లారీ వెనకనుంచి ఢీకొనడంతో నలుగురు దుర్మరణం చెందారు. తెల్లవారుజామున కావడంతో లారీ డ్రైవర్ నిద్ర మత్తులో ఉన్నారో ఏమో కానీ పెను ప్రమాదం జరిగింది. ఒక లారీని వెనుక వస్తున్న లారీ ఢొకట్టింది. ఈ ప్రమాదంలో నలుగురుదుర్మరణం పాలయ్యారు. ఈ దుర్ఘటన మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం వద్ద బైపాస్ రోడ్డులో జరిగింది. ఒక లారీని వెనుక నుంచి వచ్చిన మరో లారీ ఢీ కొట్టడంతో వెనుక లారీలోని క్యాబిన్లో కూర్చొన్న నలుగురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఘటనకు సంబంధించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలిస్తున్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
TELTEL12273
ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక


# గుడివాడ పట్టణం36 వార్డుల పరిధిలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం -ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

## - మున్సిపల్ అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము






**గుడివాడ, తెలంగాణ ముచ్చట్లు :** తన కార్యాలయంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పురపాలక సంఘ అధికారులతో రివ్యూ సమావేశం నిర్వహించారు. వర్షాకాలం సీజన్ ప్రారంభమైన దృష్ట్యా డ్రైన్లలో సిల్ట్ తొలగింపు పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అధికారులకు సూచించారు.వార్డుల వారీగా డ్రైన్లలో సిల్ట్ తొలగింపు పనుల నివేదికలను మున్సిపల్ ఏఈలను అడిగి ఎమ్మెల్యే రాము తెలుసుకున్నారు.సిల్ట్‌ను తరలించే వాహనాలు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని అధికారులకు సూచించారు. సమస్యల పరిష్కారానికి అధికారులు చేసే కృషికి, ప్రజలు కూడా సహకరించాలని ఎమ్మెల్యే రాము పిలుపునిచ్చారు. డ్రైన్లలో ఇష్టం వచ్చినట్లు చెత్త వేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలు నిర్వహించాలని మున్సిపల్ అధికారులకు ఎమ్మెల్యే రాము సూచించారు. గుడివాడ పట్టణంలో మెయిన్ రోడ్డుల అభివృద్ధికి అంచనాలు రూపొందించి సత్వరమే తనకు అందించాలని ఎమ్మెల్యే రాము అధికార యంత్రంగానికి చెప్పారు.36 వార్డుల పరిధిలో రోడ్ల మరమ్మత్తులకు ఇప్పటివరకు తీసుకున్న చర్యలపై మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే రాము ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో రోడ్ల మరమ్మతులకు 28వర్కులుగా టెండర్లు ఖరారు అయ్యాయని కొన్ని పనులు పూర్తి కాగ, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని కమిషనర్ సుబ్రహ్మణ్యం, అధికారులు ఎమ్మెల్యే రాముకు తెలియజేశారు. గుడివాడ పట్టణంలో ఏ వార్డులో పర్యటించిన రోడ్లకు మరమ్మత్తులు జరిగిన దాఖలాలు కనిపించడం లేదని, రోడ్ల మరమ్మతుల పూర్తిస్థాయి నివేదికను అందించాలని అధికారులకు ఎమ్మెల్యే చెప్పారు. అలాగే 36 వార్డుల పరిధిలో రోడ్ల సమస్యలను గుర్తించాలని ఎమ్మెల్యే రాము అధికారులకు చెప్పడంతో సచివాల ఇమ్యూనిటీ కార్యదర్శులు, మున్సిపల్ ఏఈలతో క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత సోమవారం కల్లా రోడ్ల సమస్యపై పూర్తిస్థాయి నివేదిక అందిస్తామని కమిషనర్ సుబ్రమణ్యం ఎమ్మెల్యే రాముకు తెలిపారు. గత ప్రభుత్వాలు ప్రజా సమస్యలపై కనీస దృష్టి పెట్టకపోవడం వల్లనే.... అధికారులతో తరచూ రివ్యూ సమావేశాలు నిర్వహించి వాస్తవ పరిస్థితులను గుర్తిస్తున్నామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము అన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి శాఖల వారీగా అంచనాలనుపొందించాల్సిందిగా అధికారులకు స్పష్టం చేశామన్నారు. నియోజకవర్గ పరిధిలో సంవత్సరాల తరబడి పట్టించుకోని ప్రతి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నానని.... సమస్యల పరిష్కారానికి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వ నిధులు తీసుకువచ్చే బాధ్యత నాదని ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము స్పష్టం చేశారు. రివ్యూ సమావేశంలో మున్సిపల్ ఎం.ఈ విజయదుర్గ, డి.ఇ.ప్రవీణ్, మాజీ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, సీనియర్ టిడిపి నాయకులు డాక్టర్ గోర్జి సత్యనారాయణ, గుడివాడ పట్టణ టిడిపి అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, పురపాలక సంఘ ఏఈలు, అధికారులు పాల్గొన్నారు.

# మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రిలో దారుణం

## - పెచ్చులు పెచ్చులుగా ఊడి రోగులపై పడుతున్న స్లాబ్

## - ప్రభుత్వ ఆసుపత్రిలోని హెచ్ ఐ వి విభాగంలో ఘటన







**మచిలీపట్నం, తెలంగాణ ముచ్చట్లు :** అభివృద్దే మంత్రంగా పరిపాలన సాగిస్తున్న టిడిపి హయాంలో మచిలీపట్నం లోని ప్రభుత్వ ఆసుపత్రిలోని సిబ్బంది నిర్లక్ష్య వ్యవహారం హాట్ టాపిక్ గా మారింది.అసలే జీవితంలో ఆశలు లేక మహమ్మారి హెచ్ ఐ వి బాధితులు వైద్యం నిమిత్తం యిక్కడ కు వస్తూ వుంటారు కానీ వారి ప్రాణాలకు ప్రభుత్వ ఆసుపత్రిలో గ్యారెంటీ లేకుండా పోతుందని ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని రావాల్సి వస్తుందని రోగులు వాపోతున్నారు.

# యువతి హత్య కేసును ఛేదించడంలో విశేష కృషి చేసిన పోలీసు అధికారులకు అభినందించిన ఎస్పీ





**బాపట్ల,తెలంగాణ ముచ్చట్లు : జూన్ 28 :** ఇటీవల చీరాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సంచల నంకలిగించిన యువతి అత్యాచారం హత్య కేసును చేదించడంలో విశేషకృషి చేసిన పోలీస్ అదికారులు, సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీఎస్. ఇటీవల చీరాల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగినయువతి అత్యాచారం హత్య కేసును చేదించడానికి ఏటువంటి ఆధారాలు లేకపోవడంతో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఐపీఎస్ కేసును సవాలుగా తీసుకొని అడిషనల్ ఎస్పీ, చీరాల, బాపట్ల డిఎస్పీ ల పర్యవేక్షణలో 10 మంది సిఐ ల ఆధ్వర్యంలో 10 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి 36 గం.ల లోపు కేసును ఛేదించి, నేరానికి పాల్పడిన నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించిన విషయం విధితమే. ఆ కేసును త్వరితగతిన చేదించడంలో విశేషకృషి చేసిన 21 మంది పోలీస్ అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ జూన్ 28న శుక్రవారం జిల్లా ఎస్పీ క్యాంప్ కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించి, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ గారు మాట్లాడుతూ కేసు దర్యాప్తులో ఎటువంటి క్లూస్ లేనప్పటికీ, సవాలుగా తీసుకొని ప్రతి ఒక్కరు విశేషంగా కృషిచేసి ఎవరికి అప్పగించిన బాధ్యతను వారు సమర్ధవంతంగా నిర్వహించారన్నారు. అందువలనే నేరం జరిగిన 36 గంటలలోపే కేసును ఛేదించగలిగామన్నారు. ఇదే స్ఫూర్తితో కేసు దర్యాప్తు వేగవంతంగా నిర్వహించి భౌతిక సాక్షాదారాలను, నిపుణుల నివేదికను త్వరితగతిన పొంది ఒకదానికొకటి క్రోడీకరించుకుని సంబంధిత న్యాయస్థానంలో ముద్దాయిపై అభియోగ పత్రం దాఖలు చెయ్యాలని సూచించారు. న్యాయస్థానంలో కేసు విచారణ వేగవంతంగా జరిగే విధంగా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు కేసు విచారణను పర్యవేక్షిస్తూ ఉండాలని పోలీస్ అధికారులకు తెలిపారు. నేరానికి పాల్పడిన ముద్దాయిలకు న్యాయస్థానంలో కఠినమైన శిక్షలు పడేవిధంగా చర్యలు తీసుకోవాలని, అప్పుడే బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు.

# జర్నలిస్టుల ఆత్మబంధువు కలెక్టర్ డా.మల్లికార్జున




**విశాఖపట్నం, జూన్ 27, తెలంగాణ ముచ్చట్లు :** విశాఖ జిల్లా జర్నలిస్టులకు కలెక్టర్ డాక్టర్ ఏ.మల్లికార్జున ఆత్మబంధువుగా నిలిచారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించడంలో ఆయన చూపిన చొరవ మరువలేనిది. రాష్ట్రంలో ఏ జిల్లా కలెక్టర్ అందించని సహకారాన్ని జర్నలిస్టులకు అందించిన ఘనత ఆయనది.గత సంవత్సరం వర్కింగ్ జర్నలిస్టుల హెల్త్ స్కీమ్ ప్రీమియం చెల్లింపుకు సహకారం అందించాలని కోరిన వెంటనే రూ. 4లక్షలకు పైగా సి.ఎస్.ఆర్ నిధుల కేటాయించిన సందర్భాన్ని ఎప్పటికీ మరువలేం.ఆ రెన్యూవల్ కార్డులను ఉపయోగించుకుని ఆ స్కీమ్ కింద పలువురు జర్నలిస్టులు ఆపరేషన్లు సైతం చేయించుకో గలిగారు.అంతే కాకుండా గత ఏడాది డాల్ఫిన్ డయాగ్నెసిస్ సర్వీసెస్ లో ఒక్కొక్క జర్నలిస్టుకు రూ.5 వేలకు పైగా విలువచేసే మెడికల్ టెస్టులు నిర్వహించి తోడుగా నిలిచారు. చాలామందికి ప్రెస్ అక్రిడేషన్లు కొంత ఆలస్యంగా రావటంతో టెస్టులు చేసుకోవడానికి మరొక అవకాశం కల్పించాలని జర్నలిస్టు సంఘాలు కోరిన వెంటనే స్పందించి మరొక సారి అవకాశం కల్పించారు.ఇంతకు ముందు వీ జే ఎఫ్ ప్రెస్ క్లబ్ లో జరిగిన అక్రమాలు,అవినీతి,నిబంధనల ఉల్లంఘన నేపథ్యంలో ఆ సమస్య పరిష్కరించడానికి ఒక మార్గం వేసిన అధికారి ఆయన. దానిపై సమగ్ర దర్యాప్తు జరిపించి అక్రమాలు, నిబంధనల ఉల్లంఘన జరిగాయని నిర్ధారించారు.అక్రమార్కుల చేతుల్లో ఉన్న వీజేఎఫ్ ప్రెస్ క్లబ్ ను కాపాడి ఆ కార్యవర్గం అక్కడ ఉండటానికి వీలులేదని తాళాలు వేసి అనాధికార కార్య వర్గాన్ని బయటకు పంపి జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని కాపాడిన ఘనత ఆయనది. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని జీవో ఇచ్చిన నేపథ్యంలో వెంటనే వారికి అవసరమైన 60ఎకరాలు భూములను సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించిన తొలి ఐఏఎస్ అధికారి ఆయన. జర్నలిస్టులు దిగువ మధ్యతరగతి వర్గానికి చెందినవారని ప్రైవేట్ స్కూళ్లలో 50 శాతానికి ఫీజు రాయితీ ఇప్పించాలని జర్నలిస్టు సంఘాలు కోరిన మీదట అందుకోసం ఆయన సహకరించడంతో చాలా స్కూళ్లలో ఫిజు రాయితీ పొందగలిగారు.గత ఏడాది జర్నలిస్టులకు సానుకూలంగా ప్రెస్ అక్రిడేషన్లు ఇతర జిల్లాల కంటే కాస్త ఎక్కువే కేటాయించి సహకారం అందించారు. దాంతో గత ఏడాది ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఎక్కువ మందికి అవకాశం లభించింది.సార్వత్రిక ఎన్నికలు జిల్లాలో విజయవంతంగా జరగడంతో సహకరించిన జర్నలిస్టులకు ధన్యవాదాలు చెప్పటానికి ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేసి వారిపై తనకున్న గౌరవాన్నిచాటుకున్నారు. ఈ ఏడాది జర్నలిస్టులు ఆయన సహకారాన్ని కోరకముందే ఈ సమావేశంలో స్వచ్ఛందంగా వారి కోసం గతంలో మాదిరిగానే సహకారాన్ని అందించబోతున్నామని ఆయన ప్రకటించడంతో జర్నలిస్టులు ఎంతో ఆనందించారు. ప్రస్తుతం ఆయన అందించిన సహకారంతో అపోలో హాస్పిటల్ లో అక్రిడేటెడ్ జర్నలిస్టుతో పాటు వారి జీవిత భాగస్వామితో కలిపి ఉచితంగా రూ. 10వేలు విలువచేసే వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. దాంతోపాటు గతంలో మాదిరిగానే ఈ ఏడాది కూడా అక్రి డేటెడ్ జర్నలిస్టులందరికీ వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ కింద ప్రీమియం చెల్లించడానికి సిద్ధంగానే ఉన్నామని ప్రకటించి జర్నలిస్టుల ప్రశంసలు అందుకున్నారు. చంద్రబాబు ప్రభుత్వం జర్నలిస్టులకు ఉచితంగా ఇళ్ల స్థలాలు ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టో హామీకి అనుకూలంగా ఆయన గతంలో సేకరించిన 60ఎకరాలు భూమి వారికే కేటాయించే విధంగా గతంలో తయారు చేసిన ప్రతిపాదనలు ఉపయోగపడే అవకాశం ఉంది. ఇలా అన్ని విధాలా జర్నలిస్టులకు సహకారం అందించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ మల్లికార్జున మూడేళ్లపాటు విశాఖలో సేవలందించి రెండు రోజుల కిందట బదిలీ అయిన ఆయనకు ఎన్నడూ కృతజ్ఞులుగానే ఉంటారు.


# పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై మరో కేసు నమోదు

**పల్నాడు జిల్లా,తెలంగాణ ముచ్చట్లు :** వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిపై మరో కేసు నమోదైంది. తెలుగు యువత పల్నాడు జిల్లా కార్యదర్శి కొమర శివపై పిన్నెల్లి మాచర్ల కోర్టు వద్ద పిడికిలితో కడుపులో గుద్ది దాడి చేశారని పేర్కొంటూ శివ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఐపీసీ సెక్షన్ 323 కింద మాచర్ల పోలీసులు కేసు నమోదు చేశారు.కాగా సార్వత్రిక ఎన్నికల పోలింగ్ రోజు(మే 13న), మరుసటి రోజు జరిగిన దాడులకు సంబంధించిన కేసుల్లో అరెస్టయిన మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామ కృష్ణారెడ్డికి కోర్టు రిమాండ్ విధించడంతో ఆయన్ను నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. ఈవీఎం ధ్వంసం, టీడీపీ వర్గీయులు, సీఐపై దాడి కేసుల్లో ముందస్తు బెయిల్ కోరుతూ ఆయన దాఖలుచేసిన పిటిషన్లను బుధవారం హైకోర్టు కొట్టివేయడంతో పోలీసులు ఆయన్ను అరెస్టుచేసిన సంగతి తెలిసిందే. వైద్య పరీక్షల అనంతరం ఆయన్ను అర్ధరాత్రి 12 గంటల సమయంలో మాచర్ల అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస కల్యాణ్ ఎదుట హాజరుపరిచారు. 12:30 నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు బెయిల్‌పై వాదోపవాదాలు జరిగాయి. పిన్నెల్లి తరఫున న్యాయవాది బాలసత్యనారాయణరెడ్డి వాదనలు వినిపించారు. కారంపూడి సీఐ అలహరి శ్రీనివాసరావు స్వయంగా హాజరయ్యారు.

# సినిమా న్యూస్





# మండే ఎండలో దించింది.. హీరోయిన్ పై విమర్శలు



సినిమా అనేది రంగుల ప్రపంచం. అక్కడ అనుకున్నంత సాఫీగా కింది స్థాయి వారి జీవితాలు సాగవు. వారు చేసే పనికి, తీసుకునే పారితోషికం కి సంబంధం ఉండదు అన్నట్లుగా పరిస్థితి ఉంటుంది. పైగా అక్కడ కింది స్థాయి టెక్నీషియన్స్ మరియు జూనియర్ యాక్టర్స్ కి చాలా అవమానాలు జరుగుతూ ఉంటాయి. ఏ చిన్న తప్పు చేసినా కూడా అందరి ముందు తిట్టడం చేస్తారని, కొన్ని సార్లు చేయి కూడా చేసుకుంటారు అంటూ టెక్నీషియన్స్ ఎంతో మంది ఇంటర్వ్యూల్లో చెబుతూ ఉంటారు. తాజాగా హెయిర్ డ్రెస్సర్ కమ్ మేకప్ ఆర్టిస్ట్ అయిన హేమ తన కెరీర్ లో ఎదుర్కొన్న చేదు అనుభవాల గురించి ఒక ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. చిన్న చిన్న టెక్నీషియన్స్ ఔట్ డోర్ షూటింగ్ సమయంలో చాలా ఇబ్బందులు పడుతారు. నేను ఒక సారి చెన్నైలో అమలాపాల్ నటిస్తున్న ఒక సినిమా షూటింగ్ కు వెళ్లాను. ఆ షూటింగ్ మండే ఎండలో జరుగుతుంది. కూర్చోవడానికి కనీసం చెట్టు కూడా లేదు. దాంతో నేను మరి కొందరు టెక్నీషియన్స్ కలిసి వ్యానిటీ వ్యాన్ లోకి ఎక్కాం. ఆ వ్యాన్ లో రెండు భాగాలు ఉన్నాయి. ఒక భాగంలో హీరోయిన్ అమలా పాల్ కూర్చుని ఉన్నారు. రెండో భాగంలో నేను ఇంకొంత మంది ఉన్నారు. మేము కూర్చుంటే ఆమెకు ఇబ్బందిగా ఉందని, మేనేజర్ తో చెప్పి మమ్ములను వానిటీ వ్యాన్ నుంచి కిందకి దింపింది. మండే ఎండలో ఎక్కడ నిలబడాలో కూడా తెలియక చాలా ఇబ్బంది పడ్డాం. సినిమా ఔట్ డోర్ షూటింగ్స్ కు వెళ్లినప్పుడు ఇలాంటివి చాలానే జరుగుతాయి. అన్ని సినిమాల్లో పని చేసే కింది స్థాయి టెక్నీషియన్స్ ను కూడా తక్కువగానే చూస్తారు అంటూ హేమ చెప్పుకొచ్చింది. హేమ వ్యాఖ్యలతో హీరోయిన్ అమలాపాల్ పై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.

# కల్కి' తో మృణాల్ కి వచ్చింది ఎంత...?



దేశవ్యాప్తంగా సినీ ప్రేమికులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూసిన కల్కి సినిమా నిన్న ప్రేక్షకుల ముందుకు వచ్చింది. హిట్ టాక్ దక్కించుకున్న ఈ సినిమా మొదటి రోజు వసూళ్ల విషయంలో రికార్డులు నమోదు చేసినట్లుగా బాక్సాఫీస్ వర్గాల వారితో పాటు చిత్ర యూనిట్ సభ్యులు చెప్పుకొచ్చారు. ఊహించిన విధంగా భారీ వసూళ్లు నమోదు చేసిన ఈ సినిమా రాబోయే రెండు మూడు వారాల వరకు బాక్సాఫీస్ ను షేక్ చేయడం ఖాయం. ఈ సినిమాలో గెస్ట్ రోల్స్ లో కనిపించిన విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్, వర్మ ఇతరులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గెస్ట్ రోల్స్ లో నటించిన వారిలో చాలా మంది వరకు పారితోషికం ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా చేశారని సమాచారం అందుతోంది. కల్కి వంటి పెద్ద ప్రాజెక్ట్ లో భాగం అయ్యాం అనే పేరు కోసం చాలా మంది ఇందులో పారితోషికం తీసుకోకుండానే కనిపించేందుకు ఒప్పుకున్నారు అనేది టాక్. చిన్న పాత్ర లో కనిపించిన మృణాల్ ఠాకూర్ కూడా ఈ సినిమా కోసం పారితోషికం తీసుకోలేదట. వైజయంతి మూవీస్ బ్యానర్ తో మృణాల్ ఠాకూర్ కి అనుబంధం ఉంది. టాలీవుడ్ లో ఈస్థాయి లో ఆఫర్లు రావడంకు ఆమె నటించిన మొదటి సినిమా సీతారామం కారణం అనే విషయం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. దుల్కర్ సల్మాన్ తో సీతారామం సినిమాను వైజయంతి మూవీస్ వారు నిర్మించారు. అందుకే తనకు కెరీర్ ను ఇచ్చిన వైజయంతి వారి నుంచి కల్కి సినిమా కోసం నటించి పారితోషికం తీసుకోలేదట. ప్రస్తుతం ఆమెకు వస్తున్న పారితోషికం భారీగా ఉంది. కనుక కల్కి కోసం ఆమె చిన్న పారితోషికం వద్దని ఉంటుంది. మృణాల్ మంచి మనసు నిజంగా అభినందనీయం అంటూ సినీ జనాలు మాట్లాడుకుంటున్నారు.

# చూపు తిప్పనివ్వని ముఖర్జీ అందం




ఎన్టీఆర్ హీరోగా నటించిన కంత్రి సినిమాలో మెరిసిన ముద్దుగుమ్మ తనీషా ముఖర్జీ. ఆ సినిమా తర్వాత మళ్ళీ తెలుగు లో ఈ అమ్మడు కనిపించలేదు. కానీ ఉత్తర భారతంలో ఈమె సందడి కొనసాగుతూనే ఉంది. వెండి తెర మరియు బుల్లి తెర ద్వారా ఈ అమ్మడు సాధ్యం అయినంత ఎంటర్టైన్ చేసేందుకు ప్రయత్నాలు చేస్తుంది. నటిగా చేసింది కొన్ని సినిమాలే అయినా కూడా తనదైన ముద్రను వేసింది అనడంలో సందేహం లేదు. బిగ్ బాస్ సీజన్ 7 తో బుల్లి తెరపై అడుగు పెట్టిన తనీషా ముఖర్జీ ఆ తర్వాత పలు టీవీ షో ల్లో కనిపించడం ద్వారా ప్రేక్షకులకు మరింతగా చేరువ అయ్యింది. వెండి తెర, బుల్లి తెర తో పాటు ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో ఈ అమ్మడి అందాల ఆరబోతకు నెటిజన్స్ ఫిదా అవుతున్నారు. ఈ స్థాయిలో అందాల ఆరబోత చేయడం ద్వారా పాతికేళ్ల పడుచు హీరోయిన్స్ కి కూడా పోటీ అన్నట్లుగా తనీషా నిలుస్తుంది. తాజా ఫోటో షూట్ తో చూపు తిప్పుకోనివ్వడం లేదు. టైట్ డ్రెస్ లో అందాల క్లీవేజ్ షో చేస్తూ తనీషా ముఖర్జీ చేసిన సందడి నెట్టింట అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఇలాంటి అందాల విందు ఫోటోలను షేర్ చేయడం ద్వారా ఇంకా కూడా ఈమెకు ఇండస్ట్రీలో మంచి ఆఫర్లు వస్తున్నాయి. ఆ మధ్య ఒక కామెడీ షో కి జడ్జ్ గా వ్యవహరించిన తనీషా ముఖర్జీ ఆ తర్వాత ఒక డాన్స్ షో లో కూడా జడ్జ్ గా సందడి చేసింది. మరో వైపు సినిమాలు కూడా చేస్తూ బిజీగా ఉంది. గత ఏడాది ఒక సినిమా తో వచ్చిన ఈమె ఈ ఏడాదిలో కూడా ఒక సినిమా తో వచ్చే అవకాశాలు ఉన్నాయి.

# కపూర్ ఫ్యామిలీ హీరోయిన్ నికర ఆస్తులు 90 కోట్లు



కపూర్ సంస్థానంలో నటనను వృత్తిగా ఏర్పరుచుకోవడం అంటే ఒక సాహసం. నాటి రోజుల్లో ఇతర కుటుంబాల్లో ఉన్నట్టే ఆడపిల్లలకు కట్టుబాట్లు చాలా ఎక్కువే ఉన్నాయి. రాజ్ కపూర్ వారసుల్లో మహిళలు ఎవరూ సినీరంగంలో నటించకూడదనే నియమం ఉంది. కానీ కపూర్ కుటుంబం నుంచి సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన తొలి మహిళగా కరిష్మా కపూర్ ఒక సంచలనం. బాలీవుడ్‌కు బలమైన పునాదిని ఇచ్చిన పేరుగాంచిన కుటుంబం కపూర్ కుటుంబం. ఆడాళ్లు సినిమాల్లో నటించే విషయంలో దీర్ఘకాల సంప్రదాయాన్ని కలిగి ఉ న్నారు. కానీ కరిష్మాకు తన తల్లి బబిత నుంచి గట్టి మద్దతు ఉంది. బాలీవుడ్‌లో తనదైన మార్గాన్ని ఏర్పరచుకోవడానికి తన చదువును వదిలి, నటనలో తనకున్న అభిరుచిని ఎంచుకుంది. ప్రస్తుతం కరిష్మా తన పిల్లలను ఒంటరి తల్లిగా పెంచడంపై దృష్టి పెట్టారు. భర్త సంజయ్ కపూర్ నుంచి విడాకులు తీసుకున్న సీనియర్ నటి కరిష్మా ఇటీవల టీవీ రంగంలో కొనసాగుతున్నారు. తన సినీ కెరీర్ ఎదగడానికి ప్రధాన కారణం తన డెడికేషన్, హార్డ్ వర్క్. కుటుంబానికి, సినిమాకి తనను తాను అంకితం చేసిన మేటి నటి కరిష్మా. బాలీవుడ్ లో కరిష్మా పెద్ద స్టార్ అయ్యాక.., తన సోదరి కరీనా కపూర్ కథానాయికగా తన హవాను కొనసాగించింది. 90ల నాటి మేటి ప్రతిభావని కరిష్మా కపూర్ ఈరోజు (జూన్ 25న) తన పుట్టినరోజును జరుపుకుంది. కరిష్మా 2012లో తన చివరి చిత్రం %-%డేంజరస్ ఇష్క్%-% నుండి లైమ్‌లైట్ కి దూరమైంది. అయినా కరిష్మా ఆర్థికంగా, వ్యక్తిగతంగా అభివృద్ధి చెందుతూనే ఉంది. ఇటీవలి సినిమాలేవీ లేనప్పటికీ కరిష్మా ఆర్థిక స్థితి బలంగా ఉంది. ముంబై మీడియా కథనాల ప్రకారం కరిష్మా ఆస్తుల విలువ దాదాపు రూ. 85-90 కోట్లు. తన ఆదాయాలు ముఖ్యంగా ప్రకటనలు, మోడలింగ్, బ్రాండ్ ఎండార్స్‌మెంట్ లు సహా విభిన్న వనరుల నుండి వచ్చాయి. కరిష్మా బేబి ఓయ్ కంపెనీలో పెద్ద వాటాను కలిగి ఉంది. అనేక స్వచ్ఛంద కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటుంది. అలాగే టెలివిజన్ షోలకు న్యాయనిర్ణేతగా పనిచేయడం ద్వారా వినోద పరిశ్రమకు సహకరిస్తుంది.



# కల్కి.. రికార్డుల కోసం కాదు!

మొత్తానికి బాక్సాఫీస్ వద్ద భారీ కలెక్షన్లతో దూసుకుపోతున్న "కల్కి 2898%ూణ%" సినిమాపై ప్రేక్షకుల స్పందనతో చిత్ర యూనిట్ సంతోషం వ్యక్తం చేస్తోంది. చాలా రోజుల అనంతరం టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద ఒక ప్రత్యేకమైన సందడి కనిపిస్తోంది. ప్రభాస్ ఫ్యాన్స్ అయితే ఫుల్ హ్యాపీగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇలాంటి సినిమా కోసమే అందరం ఎదురు చూస్తున్నాము అని కామెంట్స్ చేస్తున్నారు. ఇక సినిమా రికార్డులపై చాలా రకాల కామెంట్స్ వైరల్ అవుతున్నాయి. ప్రభాస్ కెరీర్ లోనే ఈ సినిమా బిగ్గెస్ట్ ఓపెనింగ్స్ లో ఒకటిగా నిలుస్తోంది అని అంటున్నారు. ఇక బాలీవుడ్ లో కూడా కల్కి గట్టిగానే సౌండ్ చేస్తోంది. నార్త్ లో మంచి కలెక్షన్లు వస్తున్నాయి. ఇక ఈ సినిమా సాధించిన వసూళ్లపై నిర్మాతల్లో ఒకరైన స్వప్న దత్ సంతోషం వ్యక్తం చేశారు. ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేసి, ప్రేక్షకుల అభిమానం, బాక్సాఫీస్ రికార్డులపై తన అభిప్రాయాన్ని పంచుకున్నారు.

**Publisher, Printer, Owner Bollepaka Rajesh,** H.No. 2-19/1, (v) Thatikayala, (m) Dharmasagar, Hanmakonda (Dist) Telangana State. Printed at Amulya publications & printers and graphics. Place of Publication H.No. 2-19/1, (v) Thatikayala, (m) Dharmasagar, Hanmakonda (Dist) Telangana State, Pin code : 506151. **Editor : Bollepaka Rajesh. 9493669669**
**TELTEL12273** Website : www.telanganamuchatlu.in “Mail I'd: telanganamuchatlu.in@gmail.com